మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 87 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad



## రైల్వేశాఖ తీపికబురు

- రైళ్లలో జనరల్ కోచ్‌లు నాలుగుకు పెంపు

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): సాధారణ ప్రయాణికులకు ఊరట కలగనున్నది. రైళ్లలో జనరల్ కోచ్‌ల సంఖ్య నాలుగుకు పెరగనున్నాయి. స్లీపర్, జనరల్ క్లాస్ కోచ్‌లలో విపరీతమైన రద్దీపై ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ కోచ్‌ల సంఖ్యను రెట్టింపు చేస్తున్నట్లు రైల్వే మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఇటీవల జరిగిన రైల్వే బోర్డు సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రైలు కోచ్‌ల వార్షిక ఉత్పత్తి కంటే



అదనంగా 2500 జనరల్ క్లాస్ కోచ్‌లు తయారు చేయనున్నారు. దీంతో మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని అంచనా వేశారు. కాగా, ప్రస్తుతం రెండు జనరల్ కోచ్‌లు ఉన్న రైళ్లలో వాటి సంఖ్య

మిగతా 2లో..



## రక్షణ రంగంలో సహకారం

- మరింత బలోపేతం చేసుకునే దిశగా ముందుకు
- షేక్ హసీనా, మోదీ కీలక భేటీ

న్యూఢిల్లీ (ప్రజా మంటలు): దేశ రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకునే దిశగా ముందుకు వెళ్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. రెండు రోజుల భారత్ పర్యటనకు వచ్చిన బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా తో ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. ఇరుదేశాల రక్షణ సహకారం, సాయుధ బలగాల ఆధునీకరణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత విదేశీ నేతలతో మోదీ భేటీ కావడం ఇదే తొలిసారి. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బంగ్లాదేశ్- భారత్ సరిహద్దులో ఉగ్ర కార్యకలపాలను అడ్డుకోవడంతోపాటు శాంతిస్థాపనకు కృషి చేయాలని ఇరుదేశాలు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ రెండు దేశాల మధ్య 4096.7 కిలోమీటర్ల సరిహద్దు ఉంది. భారత్‌కు పొరుగుదేశాలతో ఉన్న సరిహద్దులో ఇదే పెద్దది. 'ఇండియన్ ఓషన్ రీజియన్' అంశంలోనూ భారత్‌కు తోడుగా నిలిచేందుకు బంగ్లాదేశ్ ముందుకు రావడాన్ని మోదీ స్వాగతించారు. 'బే ఆఫ్ బెంగాల్

## హెల్త్ టూరిజం హబ్‌గా తెలంగాణ

**శంషాబాద్ సమీపంలో సకల వసతులో మెడికల్ హబ్**

**బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి సేవలకు ప్రశంసలు**

**24వ వార్షికోత్సవంలో పాల్గొన్న సిఎం రేవంత్ రెడ్డి**


హైదరాబాద్,జూన్22 (ప్రజా మంటలు): తెలంగాణను మెడికల్ టూరిజం హబ్‌గా ఏర్పాటు చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇక్కడ అత్యంత అధునాతన ఆస్పత్రులు ఉన్నాయని, వాటిని కనెక్ట్ చేయాల్సి ఉందన్నారు. ఇందుకోసం మెడికల్ టూరిజం ప్రతిపాదన ఉందన్నారు. సీఎం హోదాలో తాను నిత్యం 18 గంటలు పనిచేస్తున్నానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ 24వ వార్షికోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆలోచనను కుటుంబ సభ్యులు కార్యరూపంలో పెట్టారని చెప్పారు. క్యాన్సర్‌ను అరికట్టాలనేది గొప్ప ఆలోచన అని అన్నారు. భవిష్యత్ లోనూ బసవతారకంకు తోడుంటామని చెప్పారు. ఆస్పత్రి విస్తరణకు సహకరిస్తామని చెప్పారు. నిత్యం ఎంతో మందికి ఆస్పత్రి సేవలందిస్తుందని తెలిపారు. శంషాబాద్ ఎయిర్ పోర్టుకు పక్కన



భూమి తీసుకుని మెడికల్ హబ్‌గా పెద్ద ఆస్పత్రులు కట్టిస్తామని తెలిపారు. హైదరాబాద్ కు వస్తే జబ్బు నయమౌతుందనేలా చేస్తామని అన్నారు. అభివృద్ధి సంక్షేమంలో తెలుగు రాష్ట్రాలు పోటి పడుతాయని తెలిపారు. 24వ వార్షికోత్సవానికి బాలకృష్ణ ఆహ్వానించారని 30 వ వార్షికోత్సవానికి కూడా తానే వస్తానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. బసవతారకం ఆసుపత్రి లక్షలాది మందికి సేవలందిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నిస్వార్థంగా పేదలకు సేవలందించేందుకు ఆసుపత్రిని నిర్మించారని చెప్పారు. ఏపీ సీఎం చంద్రబాబుతో అభివృద్ధిలో పోటీపడే అవకాశం నాకు వచ్చింది. ఆయన 18 గంటలు పనిచేసి.. నేను 12 గంటలు పని చేస్తే సరిపోదు. తెలంగాణ రాష్ట్ర నేతలు, అధికారులు కూడా 18 గంటలు పని చేయాల్సిందే. అభివృద్ధిలో తెలుగు రాష్ట్రాలు పోటీ పడాలి.. ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలి. హెల్త్ టూరిజం హబ్ ఏర్పాటు చేయాలని చూస్తున్నాం అని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి తెలిపారు. అన్ని రకాల వైద్యసేవలు అందించేందుకు హెల్త్ టూరిజం హబ్ ఉంటుందన్నారు. అందులో బసవతారకం ఆసుపత్రికి తప్పకుండా స్థానం ఉంటుంది.

మిగతా 2లో..



## పేపర్ లీకేజీలపై కొరఢా

- అమల్లోకి ప్రివెన్షన్ యాక్ట్
- గెజిట్ నోటిఫికేషన్ విడుదల
- ఇక నుంచి బాధ్యులపై కఠిన చర్యలు
- పేపర్ లీక్ చేస్తే 5 నుంచి పదేళ్ల జైలు
- రూ.కోటి వరకు జరిమానా విధింపు

న్యూఢిల్లీ (ప్రజా మంటలు): దేశంలో వరుస పేపర్ లీకులతో సతమవుతున్న కేంద్రం ప్రభుత్వం యాక్షన్ ప్లాన్ మొదలుపెట్టింది. పేపరు లీకేజీలకు కారణమైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకుగాను యుద్ధప్రాతిపదికన 'ది పబ్లిక్ ఎగ్జామినేషన్స్(ప్రివెన్షన్ ఆఫ్ అన్ ఫెయిర్ మీన్స్)యాక్ట్-2024ను అమల్లోకి తీసుకొచ్చింది. ఇది జూన్ 21 నుంచి అమల్లోకి వచ్చినట్లు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందుకు సంబంధించి న్యాయశాఖ నిబంధనలు రూపొందిస్తోందని, త్వరలో నోటిఫై చేస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన ఆ వ్యాఖ్యలు చేసిన 24 గంటల్లోపే కేంద్ర సిబ్బంది, వ్యవహారాలశాఖ ఈ చట్టాన్ని అమల్లోకి తెస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం ఎవరైనా చట్టవిరుద్ధంగా పరీక్ష పేపర్లను అందుకున్నా, ప్రశ్నలు, జవాబులను లీక్ చేసినా, పరీక్ష రాసే వారికి అనుచితంగా సాయం చేసినా, కంప్యూటర్ నెట్‌వర్క్‌ను ట్యాంపరింగ్ చేసినా, నకిలీ పరీక్షలు నిర్వహించినా, నకిలీ ప్రవేశపరీక్ష కార్డులు జారీ చేసినా నేరంగా పరిగణిస్తారు. పేపరు లీక్ చేసేవాళ్లకు 5 నుంచి 10 సంవత్సరాల వరకు జైలుశిక్షతోపాటు రూ.కోటి వరకు జరిమానా విధించే వెసుబాటు ఉంది. ఇందులో భాగస్వాములు వ్యవస్థీకృత నేరానికి పాల్పడినట్లు రుజువైతే.. వారి ఆస్తులనూ జప్తు చేస్తారు. పరీక్ష నిర్వహణకు అయిన ఖర్చునూ వారినుంచే వసూలు చేస్తారు. ఈ కొత్త చట్టం ప్రకారం పేపర్ లీకేజీకి పాల్పడినా, మాల్ ప్రాక్టీస్ చేసినా, నకిలీ వెబ్‌సైట్లు తెరిచినా గరిష్ఠంగా పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.కోటి వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. యూపీఎస్సీ, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, ఐబీపీఎస్, ఎన్‌డీఏ తదితర పోటీ పరీక్షలతో పాటు నీట్, జేఈఈ, సీయూఈటీ వంటి ఎంట్రన్స్ టెస్టులకు సైతం చట్టం వర్తించనుంది. పేపర్ లీక్ కేసుల్లో దోషులుగా తేలే వారికి కనీసం మూడు నుంచి ఐదేళ్ల జైలు శిక్ష పడుతుంది. అయితే పేపర్ లీక్ వ్యవహారాల్లో వ్యవస్థీకృత నేరాలకు పాల్పడిన వారికి ఐదు నుంచి పదేళ్ల జైలుశిక్ష విధించాలని బిల్లులో పెట్టారు. విద్యార్థులు, ఉద్యోగార్థుల భవిష్యత్‌తో ఆడుకోవడమే కాబట్టి.. ఇలాంటి నేరాలు చేసే వారికి భవిష్యత్ లేకుండా చేసేలా శిక్షలు ఉంటాయి. పరీక్షల నిర్వహణ బాధ్యతలను చేపట్టే సర్వీస్ ప్రొవైడర్ సంస్థలు పేపర్ లీక్ చేసినట్లు తేలితే

మిగతా 2లో..

## ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ సాహసోపేత నిర్ణయం

- సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు
- గతంలో ఎప్పుడూ ఇలా చేయలేదు
- రైతుల విషయంలో రాజీలేదు: మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

నల్లగొండ, (ప్రజా మంటలు): ఏకబిగిన రెండు లక్షల రుణమాఫీ గతంలో ఎవరు చేయలేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వాలు చేసిన రుణమాఫీ వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం కలగలేదన్నారు. రెండు లక్షల రుణమాఫీ దేశంలో ఏ ప్రభుత్వం కూడా అమలు చేయలేదని ఆయన వ్యాఖ్యానించారు.



జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజర్యారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీ నిర్ణయం తీసుకున్న సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. రైతులకు సంబంధించిన ఏ విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వం రాజీపడదని, రైతు భరోసా ఏ విధంగా చేయానే దానిపై ప్రభుత్వం కమిటీ వేసిందన్నారు. రెండు లక్షల రుణమాఫీ అందుకుంటున్న రైతులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అంతేకాకుండా.. జిల్లాలో ఏ గ్రామంలో కూడా మిషన్ భగీరథ పథకం అందడం లేదని, ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులతో సమీక్ష నిర్వహించి పూర్తిస్థాయిలో తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## విభజన హామీలు అమలు చేయాలి: భట్టి

- కేంద్రం పన్నుల వాటా సవరించాలి
- సర్‌చార్జీలు, సెస్ ఛార్జీలు 10 శాతం మించి ఉండొద్దు
- వెనుబడిన జిల్లాలకు నిధుల కేటాయింపు పెంచాలి
- ఫర్టిలైజర్స్‌పై జీఎస్టీ 18 నుంచి 5 శాతానికి తగ్గించాలి
- నిర్మలా సీతారమన్‌తో సమావేశంలో భట్టి విక్రమార్క ప్రతిపాదనలు


న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): విభజన చట్టంలో కేంద్రం నుంచి విడుదల కావాల్సిన రూ. 2200 కోట్లు ఇంకా విడుదల కాలేదని ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. .జీఎస్టీ సమావేశంలో పాల్గొన్న భట్టి రాష్ట్రాలకు పన్ను వెసులుబాటు ఇవ్వాలని కోరామన్నారు. మూలధనం వ్యయాన్ని పెంచి పథకాలు కొనసాగించాలన్నారు. ఆదాయ పంపిణీలో అసమానతలు పెరిగిపోతున్నాయన్నారు. కేంద్ర పన్నులతో రాష్ట్రాల ఆదాయం తగ్గిందని చెప్పారు. కొన్ని కేంద్ర ప్రాయోజిత పథకాలపై పున:సమీక్షించాలని కోరారు. సర్ చార్జీలు, సెస్ లపై 10 శాతం మించి ఉండొద్దన్నారు. స్కిల్ డెవల్ పమెంట్ సెటర్లను ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరామని మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. వెనుబడిన జిల్లాలకు నిధుల కేటాయింపు పెంచాలన్నారు. తెలంగాణకు మరిన్ని నవోదయ పాఠశాలలు పెంచాలన్నారు. మూసీ డెవలప్ మెంట్ ప్రాజెక్టుకు కేంద్ర సహకారం కోరామన్నారు. ఫర్టిలైజర్స్ పై జీఎస్టీ 18 నుంచి 5 శాతానికి తగ్గించాలని కోరినట్లు చెప్పారు. రాష్ట్ర సమస్యలపై మరోసారి నిర్మలాసీతారామన్ ను కలుస్తామని వెల్లడించారు. . హైదరాబాద్ గ్లోబల్ సిటీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బొగ్గు వేలంపై బీఆర్ఎస్ నేతలు మొసలి కన్నీరు కారుస్తున్నారని .. వారి వల్లే బొగ్గు వేలం చట్టం వచ్చిందని చెప్పారు. బొగ్గు వేలం ఆపితే ఇల్లందు, సత్తుపల్లి గనులు ఎందుకు పోయాయని ప్రశ్నించారు. సింగరేణికి నష్టం జరిగేలా తమ సొంత వారికీ గనులు వచ్చేలా బీఆర్ఎస్ అధిష్ఠానం వ్యవహరించిందని ధ్వజమెత్తారు. అంతర్గత వనరులు సమీకరించుకుని



తాము రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన ప్రీ బి÷-జడెట్,జీఎస్టీ కౌన్సిల్ సమావేశం శనివారం ఢిల్లీలో జరిగింది. ఈ సమావేశం భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ... కేంద్ర ప్రాయోజిత

మిగతా 2లో..

## ప్రజా నాడి




## చిరువ్యాపారులకు ఆర్థికదన్నుగా..

- మూడు సేవలపై జీఎస్టీ తగ్గింపు..
- జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): చిన్న వ్యాపారులకు మేలు చేసేలా జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాలు తీసుకున్నదని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. త్వరలో బడ్జెట్ పార్లమెంట్ సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరిగింది. జీఎస్టీపై ట్రిబునళ్లు, కోర్టుకు వెళ్లే ట్రాన్సాక్షన్ పరిమితి పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు




సమావేశం తర్వాత నిర్మలా సీతారామన్ మీడియాకు చెప్పారు. అలాగే వ్యాపారులు జరిమానా చెల్లించడంలో ఆలస్యమైతే, దానిపైన వడ్డీ కూడా చెల్లించాల్సి ఉందని, దీన్ని ఎత్తేయాలని జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల నుంచి ప్రతిపాదనలు వచ్చాయన్నారు. ఇన్ పుట్ క్రెడిట్ టాక్స్ విషయంలో మార్పులు చేయాలని నిర్ణయించినట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. ప్రత్యేకించి, ఇన్ పుట్ క్రెడిట్ టాక్స్ విషయంలో మోసాలు జరుగకుండా ఆధార్ అథంటికేషన్ తప్పనిసరి అమలు చేయాలని నిర్ణయించాం అని తెలిపారు. అన్ని రకాల కార్టన్ బాక్సులపై జీఎస్టీ 12 శాతానికి కుదించడం ద్వారా ఆపిల్, ఇతర పండ్ల వ్యాపారులకు మేలు జరుగుతుందన్నారు. స్ప్రింకర్లు, సోలార్ కుక్కర్లపై జీఎస్టీ 12 శాతానికి తగ్గించాలని కూడా జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయించింది. జీఎస్టీ చట్టంలోని సెక్షన్ 73 నిబంధన కింద విధించే జరిమానాలపై ప్రధానంగా చర్చించినట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. గతేడాది అక్టోబర్ తర్వాత జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరుగడం ఇదే తొలిసారి అని నిర్మలా సీతారామన్ చెప్పారు. సార్వత్రిక ఎన్నికల వల్ల చాలా కాలం తర్వాత జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరిగిందని తెలిపారు. శనివారం చర్చించిన అంశాలపై పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తర్వాత మరోమారు చర్చిస్తాం జీఎస్టీ కౌన్సిల్ సమావేశమై ఈ రోజు చర్చించిన అంశాలపై తుది నిర్ణయం తీసుకుంటుందని నిర్మలా సీతారామన్ చెప్పారు.

## నీట్ రద్దుతో లక్షలాది మంది విద్యార్థులు నష్టపోతారు

- అందుకే ఆ నిర్ణయం తీసుకోలేదు
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన 'నీట్- యూజీ2024 ప్రవేశపరీక్ష దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది. పరీక్షకు ముందు రోజే పేపర్ లీకైందంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు ఏకంగా 67 మంది విద్యార్థులకు 720కి 720 మార్కులు రావడం అనుమానాలను మరింత బలపరుస్తోంది. పేపర్ లీకైనట్లు ఓ వైపు కేంద్రం పరోక్షంగా అంగీకరిస్తున్నా.. పరీక్షను రద్దుకు మాత్రం ససేమిరా అంటోంది. అసలు నీట్ పరీక్షను రద్దు చేయకపోవడానికి గల కారణాలను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ వివరించారు. నీట్- యూజీ ప్రవేశ పరీక్ష పేపర్ లీకేజ్ వల్ల కొందరు విద్యార్థులు లాభపడి ఉన్నప్పటికీ.. పరీక్షను రద్దు చేస్తే ఎంతో కష్టపడి చదివి రాసిన లక్షలాది మంది విద్యార్థులు నష్టపోతారని పేర్కొన్నారు. పాసైన వారి కష్టమంతా వృథా అవుతుందని చెప్పారు. 2004, 2015లో ఈ తరహా ఘటనలే చోటు చేసుకున్నాయని, అయితే లీకేజీ వ్యవహారం భారీ ఎత్తున జరగడంతో అప్పట్లో పరీక్షను రద్దు చేసినట్లు గుర్తు చేశారు. అయితే, ఈసారి లీకేజీ కొన్ని సెంటర్లలో మాత్రమే జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయని, నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మరోవైపు నీట్-యూజీ 2024 కౌన్సెలింగ్ ప్రక్రియను వాయిదా వేసేందుకు సుప్రీం కోర్టు కూడా నిరాకరించింది. జులై 6న నిర్వహించాల్సిన కౌన్సిలింగ్‌ను యథాతథంగా కొనసాగించాలని శుక్రవారం ఆదేశించింది. అంతేకాకుండా పేపర్ లీకేజీపై పెనుదుమారం కొనసాగుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం కూడా కీలక నిర్ణయం తీసుకుంది.

మొదటి పేజీ తరువాయి

## హెల్త్ టూరిజం హబ్‌గా తెలంగాణ

వెయ్యి ఎకరాల్లో హెల్త్ టూరిజం హబ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రపంచంలోని ఎవరైనా హైదరాబాద్‌కు వస్తే అన్ని రకాల వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. ఎన్టీఆర్ ఆలోచనలో ఏర్పాటైన ఈ ఆసుపత్రి 24 ఏళ్లుగా కోట్లాది మందికి సేవ చేయడం ఆనందదాయకమని రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగించేందుకు చంద్రబాబు నాయుడు ఆసుపత్రిని పూర్తి చేసి పేదలకు సేవలు అందించడం అభినందనీయమన్నారు. నిరుపేదలకు వైద్యసేవలు అందించాలన్న ఎన్టీఆర్ ఆశయాలను అమలు చేయడం చూసి స్వర్గం నుంచి మనల్ని ఆశీర్వదిస్తానన్నారు. నిరుపేదలకు క్యాన్సర్ వ్యాధిని నయం చేసేందుకు వైద్యరంగంలో విశేష కృషి చేసిన ఎన్టీఆర్ బసవతారం ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆసుపత్రికి సంబంధించి ఎలాంటి సహకారం అందించాలన్నా మా ప్రభుత్వం అండగా ఉంటుందని ఆసుపత్రి ఛైర్మన్ బాలకృష్ణ హామీ ఇచ్చారు. అభివృద్ధి, సంక్షేమంలో చంద్రబాబు నాయుడుతో పోటీపడే అవకాశం వచ్చిందన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో తెలుగు రాష్ట్రాలు ప్రపంచానికే ఆదర్శంగా నిలవాలన్నారు. ఎన్టీఆర్‌కు రాజకీయాలు, సంక్షేమం వారసత్వంగా వచ్చాయి.రెండు కిలోల బియ్యంతో బసవతారకం ఆస్పత్రిని నిర్మించి పేదలకు అండగా నిలిచారని ఎన్టీఆర్ అన్నారు. ఎన్టీఆర్ మొదటి తరం అయితే, రెండో తరం చంద్రబాబు, బాలకృష్ణ అని, మూడో తరం లోకేష్, భరత్ అని రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ మూడో తరం కూడా దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షిస్తు న్నట్లు తెలిపారు. నందమూరి తారక రామారావు భార్య, బాలకృష్ణ తల్లి బసవతారకం క్యాన్సర్‌తో మరణించారు. ఆ సమయంలో క్యాన్సర్ చికిత్స అందుబాటులో లేదు. దీంతో కేన్సర్ బారిన పడిన పేదలు వైద్యం చేయించుకోలేకపోతున్నారు. అందుకే పేదలకు వైద్య సహాయం అందించేందుకు ఎన్టీఆర్ ఈ బసవతారకం ఆసుపత్రిని ప్రారంభించారు. డొనేషన్‌తో నడిచే ఈ ఆసుపత్రిలో పేదలకు అతి తక్కువ ఖర్చుతో వైద్యం అందుతుంది. అందుకే అన్ని ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి క్యాన్సర్ రోగులు వచ్చి చికిత్స పొందుతున్నారు. క్యాన్సర్ మహమ్మారి ప్రజలను పట్టి పీడిస్తోందని బసవతారకం ఆసుపత్రి ఛైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ నందమూరి బాలకృష్ణ అన్నారు. ఆసుపత్రి సేవల విస్తరణ కోసం సీఎం రేవంత్‌రెడ్డి సహకారం కోరగానే అంగీకరించారని చెప్పారు. దాతల సహకారంతో ఆసుపత్రి ఈ స్థాయికి చేరుకుందని తెలిపారు. సేవలను మరింత విస్తరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, డా.నోరి దత్తాత్రేయుడు పాల్గొన్నారు.

## రైల్వేశాఖ తీపికబురు

నాలుగుకు రెట్టింపు అవుతుందని సీనియర్ రైల్వే అధికారి తెలిపారు. జనరల్ కోచ్‌లు లేని రైళ్లకు రెండు సమకూరుతాయని చెప్పారు. ఒక్కో జనరల్ కోచ్‌లో 150 నుంచి 200 మంది ప్రయాణించేలా తయారు చేస్తున్నట్లు వెల్లడించారు. దీంతో ప్రతి రోజూ అదనంగా ఐదు లక్షల మంది జనరల్ కోచ్‌లో ప్రయాణించ వచ్చని అన్నారు.మరోవైపు జనరల్ కోచ్‌ల పెంపు ప్రణాళికతో మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల సామర్థ్యం పెరుగుతుందని రైల్వే అధికారులు తెలిపారు. దీని కోసం 1377 స్లీపర్ క్లాస్ కోచ్‌లతోపాటు అదనంగా 2500 జనరల్ కోచ్‌లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అందుబాటులోకి వస్తాయని చెప్పారు. దీంతో జనరల్ బోగిల్లో ఏటా 18 కోట్ల మంది ప్రయాణికులు ట్రావెల్ చేసేందుకు వీలు కలుగుతుందని వివరించారు.

### విభజన హామీలు అమలు చేయాలి: భట్టి

పథకాల్లో కొంత వెసులుబాటు కల్పించాలని కోరారు. ఆయా రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా నిధులు ఉపయోగించుకునే అవకాశం ఇవ్వాలన్నారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటుకు బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. సమాజంలో అసమానతలు తగ్గించేందుకు సమ్మిళిత అభివృద్ధి చేయాలని కోరారు. సెస్, సర్ ఛార్జ్ పన్నులు పది శాతం మించకుండా చేయాలన్నారు. రాష్ట్రాల నికర రుణపరిమితి సీలింగ్ ముందుగానే చెపితే దానికి అనుగుణంగా బ్జడెట్ పెట్టుకుంటామని స్పష్టం చేశారు. జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయింపులు ఉండాలని కోరారు. కేంద్ర ప్రాయోజిత పథకాల కింద గత ఏడాది తెలంగాణకు 1.4 శాతమే నిధులు వచ్చాయని తెలిపారు. ఉపాధి హామీ నిధులు ఆస్తుల సృష్టి పనులకు వినియోగించేలా అనుమతులు ఇవ్వాలని కోరారు. మూసి రివర్ ఫ్రంట్‌కు నిధులు కేటాయించాలని కోరామని భట్టి విక్రమార్క అన్నారు.

## పేపర్ లీకేజీలపై కొరఢా

వాటికి రూ.కోటి వరకు జరిమానా విధిస్తారు. పరీక్ష నిర్వహణకు అయిన ఖర్చునంతా సంస్థ నుంచి రికవర్ చేయాలనే ప్రతిపాదనను కూడా ఈ బిల్లులో పొందుపరిచారు. ఇలాంటి సంస్థపై పరీక్షలు నిర్వహించకుండా నాలుగేళ్ల పాటు బ్యాన్‌ను కూడా విధిస్తారు. పేపర్ లీక్ కేసుల విచారణను డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ లేదా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ స్థాయి కంటే తక్కువ లేని అధికారి నిర్వహించాల్సి ఉంటుంది. దర్యాప్తును ఏదైనా కేంద్ర ఏజెన్సీకి అప్పగించే అధికారం కూడా కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది. ఈ బిల్లులో పేపర్ లీక్‌తో ముడిపడిన 20 రకాల నేరాలు, అక్రమాలకు పాల్పడే వారికి విధించాల్సిన శిక్షల గురించి ప్రస్తావించారు. మాస్ కాపీయింగ్,

## రక్షణ రంగంలో సహకారం

ఇనిషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోపరేషన్ తోపాటు ఇతర అంతర్జాతీయ ఫోరమ్‌ల విషయంలోనూ ఇదే సహకారాన్ని కొనసాగిస్తామన్నారు.ఇరుదేశాల మధ్య వాణిజ్య, సహకార సంబంధాల బలోపేతానికి కృషి చేస్తామని మోదీ తెలిపారు. "గత 10 ఏళ్లలో మేం ఇరుదేశాల మధ్య 1965 నాటికి ముందున్న సంబంధాలను పునరుద్ధరించాం. ఇకపై డిజిటల్, ఎనర్జీ కనెక్టివిటీపై దృష్టి పెడతాం. తద్వారా ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలు పటిష్ఠమవుతాయి" అని మోదీ అన్నారు. మొత్తం 54 నదులు భారత్, బంగ్లాదేశ్ మీదుగా ప్రవహిస్తున్నట్లు గుర్తు చేసిన ప్రధాని.. వరదల నిర్వహణ, ముందస్తు హెచ్చరికలు, తాగునీటి ప్రాజెక్టుల విషయంలో పరస్పరం సహకరించుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 1996 నాటి గంగా జలాల ఒప్పందాన్నే అనుసరిస్తున్నామని, దీనిలో కొన్ని మార్పులు చేయాలని తాజా సమావేశంలో నిర్ణయించామన్నారు. దీని కోసం భారత్ నుంచి ఓ సాంకేతిక బృందం త్వరలోనే బంగ్లాదేశ్‌కు వెళ్లి అక్కడి అధికారులతో చర్చలు జరుపుతుందని చెప్పారు. ఈ సమావేశంలో ఇరుదేశాల ప్రధానులు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. బంగ్లాదేశ్ నుంచి చికిత్స కోసం భారత్‌కు రావాలనుకునే వారికి ఇకపై ఈ-వీసా సదుపాయాన్ని కల్పించనున్నారు. దీనికోసం రంగ్‌పుర్‌లో కొత్తగా అసిస్టెంట్ హై కమిషన్ కార్యాలయాన్ని ప్రారంభించబోతున్నట్లు మోదీ తెలిపారు. బంగ్లాదేశ్‌లోని వాయవ్య ప్రాంత ప్రజలు సులువుగా భారత్‌కు వచ్చి చికిత్స పొందే వీలుంటుందని చెప్పారు. బంగ్లాదేశ్‌తో సంబంధాలకే భారత్ అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని ఈ సందర్భంగా మోదీ స్పష్టం చేశారు.

## దాడికి గురైన ఈశ్వరమ్మకు జూపల్లి పరామర్శ

### తోణ సాయంగా 2 లక్షలు అందిస్తామని ప్రకటన

కొల్లాపూర్,జూన్22 (ప్రజా మంటలు):



కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లిలో దాడికి గురైన చెంచు మహిళ ఈశ్వరమ్మను మంత్రి జూపల్లి కృష్ణారావు పరామర్శించారు. నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖానలో చికిత్స పొందుతున్న ఆమెను పరామర్శించిన మంత్రి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఆమెకు అండగా ఉంటుందని చెప్పారు. తక్షణ సహాయంగా రూ.2 లక్షలు, ప్రభుత్వం తరఫున కొంత భూమి ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఈశ్వరమ్మ పిల్లలను రెసిడెన్షియల్ పాఠశాలలో చేర్పిస్తామని తెలిపారు. ఆమెను శారీరకంగా, మానసికంగా హింసించిన వారికి చట్టపరంగా శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏం జరిగిందంటే.. ఈశ్వరమ్మ, భర్త ఈదన్న తమ వ్యవసాయ భూమిని అదే గ్రామానికి చెందిన వెంకటేశ్ అనే వ్యక్తికి కౌలుకు ఇచ్చారు. ఆ భూమిలో వెంకటేశ్ ఫిల్టర్ ఇసుక తయారీ కేంద్రం పెట్టుకోగ తన దగ్గరే ఈదన్న, బాధితురాలు ఈశ్వరమ్మ పని చేసేవారు. ఒక రోజు భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో ఈశ్వరమ్మ తన పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో ఈశ్వరమ్మ పనికి రావట్లేదని యజమాని వెంకటేష్.. ఈశ్వరమ్మను పుట్టింటి నుండి తీసుకొచ్చి తన దగ్గరే గదిలో బంధించి పాశవికంగా దాడి చేశాడు. ఈశ్వరమ్మను మర్మంగాలపై కారం చల్లి, డీజిల్ పోసి నిప్పంటించి, కర్రలతో తీవ్రంగా కొట్టడంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్ళింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఈశ్వరమ్మను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## రైతుల కోసం పోరాడుతాం

### - వెంటనే రైతు బంధు ఇవ్వండి- నిరంజన్‌రెడ్డి డిమాండ్





హైదరాబాద్ (ప్రజా మంటలు):
యాసంగి పంటకు ఎకరాకు రూ.10వేలతో పాటు రైతు భరోసా పథకం కింద ఎకరాలకు రూ.15వేలు సాయం అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వానాకాలం విడత వ్యవసాయ పెట్టుబడి మద్దతు పథకాన్ని ప్రభుత్వం ఇంకా అమలు చేయడం లేదని మండిపడ్డారు. రుతుపవనాలకు ముందు వర్షాలు కురిసి ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నప్పటికీ రైతు భరోసా అమలుకు సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం ఖరారు చేయడం లేదని విమర్శించారు. రైతుబంధు లక్ష్యంగా చేసుకుని అధికారంలో ఉన్న వ్యక్తులు చేస్తున్న అసత్య ప్రచారం ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమి సాగుకు యోగ్యమైందేనన్నారు. ప్రతి రైతు ఆధీనంలో ఉన్న భూమిని రుజువు చేస్తూ పట్టేదార్ పాసుపుస్తకాల ఆధారంగా రైతులందరికీ రైతు బంధు సహాయం అందించడం జరిగిందన్నారు. పంటలు పండించడానికి రైతులను ప్రోత్సహించడానికి పెట్టుబడి సాయం అందించామని.. రాష్ట్రంలో దాదాపు 95 శాతం మంది రైతులు ఐదెకరాలు, అంతకంటే తక్కువ భూమి కలిగి ఉన్నారు. ఐదు నుంచి ఏడు ఎకరాలు కలిగి ఉన్న వారు ఏడుశాతం కంటే తక్కువగా ఉన్నారని చెప్పారు. 20 ఎకరాల నుంచి 54 ఎకరాల వరకు భూమి ఉన్న రైతులు కేవలం 6,488 మంది మాత్రమే ఉన్నారన్నారు. ప్రస్తుత వనకాలం సీజన్‌లో పంట పెట్టుబడికి మద్దతుగా అవసరమైన సహాయాన్ని ప్రభుత్వం మరింత ఆలస్యం చేయకుండా రైతులకు చెల్లించాలన్నారు.రుణమాఫీ హామీపై ప్రభుత్వం కేబినెట్‌లో చర్చ కొనసాగుతోందని.. రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమీక్షించాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 9న రైతు రుణమాఫీ చేస్తున్నామని చెప్పి ఆగస్టు 15కు మార్చారని, హామీల అమలులో కాలయాపన చేయడం, కేసీఆర్‌ను విమర్శించడమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిగా మారిందని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో రుణమాఫీ కాకుండా మిగిలింది రూ.4వేల కోట్లు మాత్రమేనని, కేసీఆర్ హయాంలో జరిగిన రుణమాఫీని రేవంత్‌రెడ్డి తక్కువ చేసి చూపుతున్నారన్నారు. రూ.2లక్షల పంట రుణాలు ఎంత మందికి ఉన్నాయనే వివరాలు ప్రభుత్వం బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అప్పుడే రుణమాఫీ జరిగిందన్నట్లు మీడియా సంస్థలు ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు.రైతు భరోసాపై మంత్రివర్గ ఉపసంఘం వేసి జూలై 15 దాకా డెడ్‌లైన్ పెట్టారని, అప్పటికే నాట్లు వేసే పని పూర్తవుతుందని.. సీజన్ అయిపోయాక రైతు భరోసా ఇస్తారా? అని నిలదీశారు. రైతు భరోసాకు అర్హులను ఇప్పటి వరకు ఎందుకు తేల్చలేదని ప్రశ్నించారు. 68.90 లక్షల మందికి 1.52 కోట్ల ఎకరాలకు 11 విడతల్లో రూ.72వేల కోట్లను కేసీఆర్ హయాంలో రైతుబంధు కింద ఇచ్చామని, 2,603 క్లస్టర్లు రాష్ట్రంలో ఉన్నాయన్నారు. ప్రతి క్లస్టర్‌లో 5వేల ఎకరాలు ఉంటాయని.. డేటా అంతా రాష్ట్ర ప్రభుత్వం దగ్గర ఉందని, రైతు భరోసాకు మంత్రివర్గ ఉపసంఘం వేయడం కుంటి సాకు మాత్రమేనని నేతలు మండిపడ్డారు.

## విశాఖలో అనుమతి లేకుండా వైకాపా కార్యాలయం

### నోటీసులు ఇచ్చిన మున్సిపల్ కార్పోరేషన్

విశాఖపట్టణం,జూన్22 (ప్రజామంటలు): ఒక వైపు అమరావతిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయానికి చట్టబద్ధత లేదంటూ నిర్మాణంలో ఉన్న కార్యాలయాన్ని కూల్చేసిన రోజునే విశాఖలోని పార్టీ ఆఫీస్‌కు గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ నోటీసులు ఇచ్చింది. అమరావతిలో నిర్మాణాల కూల్చివేత పూర్తయిన వెంటనే విశాఖ పార్టీ కార్యాలయానికి నోటీసులు ఇవ్వడం ఆసక్తికరంగా మారింది. ఐదేళ్ల పాటు అధికారంలో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కనీసం అనుమతులు లేకుండా కార్యాలయాలను ఎలా నిర్మించిందనే ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా విశాఖలోనూ వైసీపీ కార్యాలయానికి జీవీఎంసీ నోటీసులు అంటించింది. ఎండాడలోని సర్వే నంబర్ 175/4 లో 2 ఎకరాలలో స్థలంలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేశారని నోటీసులలో అభ్యంతరం వ్యక్తం చేసిన మున్సిపల్ కార్పొరేషన్, జీవీఎంసీ నుంచి కాకుండా అనుమతులు కోసం వీఎంఆర్‌డీఏకు దరఖాస్తు చేయడం, అక్కడా అనుమతులు రాకుండానే నిర్మాణాలు పూర్తి చేయడంపై వివరణ కోరింది. వారం రోజుల్లోపు సరైన వివరణ ఇవ్వకపోతే తదుపరి చర్యలు ఉంటాయంటూ వైఎస్ఆర్సీపీ కార్యాలయానికి జోన్ 2 టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నోటీసు అంటించారు. మూడేళ్ల క్రితం విశాఖలోని చినగదిలి మండలం ఎండాడ గ్రామం సర్వే నంబరు 175/4లో రెండు ఎకరాల స్థలాన్ని వైఎస్ఆర్సీపీ కార్యాలయానికి కేటాయించారు. సాధారణంగా ఇక్కడ కట్టే భవన నిర్మాణాలకు గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఎ÷-లాన్ అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ వీఎంఆర్డీఏలో ప్లాన్ అనుమతి కోసం 525 రోజుల క్రితం దరఖాస్తు చేశారు. ఇందుకోసం 10వేలు చెల్లించారు. అయితే, ఇన్నాళ్లూ ఏమైందో తెలియదు కానీ, రెండు రోజుల క్రితం, జూన 20వ తేదీ గురువారం మధురవాడ జోన్-2 సచివాలయ ఎ÷-లానింగ్ కార్యదర్శి ఎండాడలోని వైఎస్ఆర్సీపీ కార్యాలయం దగ్గరకు వెళ్లారు. భవన నిర్మాణాలకు ఎలాన్ ఉందా.. లేదా అని ఆరా తీశారు. దీంతో 525 రోజులుగా ఈ భవనాల ఎలాన్ దస్త్రం వీఎంఆర్డీఏలో పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించారు. 525 రోజులుగా భవన నిర్మాణానికి అనుమతులు రాలేదని తెలిసి, జూన్ 20వ తేదీన 14 లక్షలు చెల్లించారు వైసీపీ నేతలు. దీంతో ఎన్టీపీ లాగిన్ నుంచి అదేరోజు రాత్రి 7.27 గంటలకు దస్త్రం ముందుకు కదిలి వీఎంఆర్డీఏ టౌన్ ఎ÷-లానింగ్ లోని సతీష్ అనే ఉద్యోగి లాగిన్ కు చేరింది. ఆ తర్వాత శుక్రవారం సాయంత్రం 3.57 గంటలకు డి. రామానాయుడు అనే ఉద్యోగి లాగిన్ కు వెళ్లగా, అక్కడ 19 నిమిషాల్లో దస్త్రానికి ఆమోదముద్ర వేసి పై అధికారులకు పంపినట్టు తాజాగా గుర్తించిన జన సేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వీఎంఆర్డీఏ టౌన్ ఎ÷-లానింగ్ అధికారులు అనుమతులు నిలిపివేశారు. ఇది గమనించిన జీవీఎంసీ తాజాగా నోటీసులు జారీ చేసింది. ఏకంగా వైఎస్ఆర్సీపీ కార్యాలయానికి నోటీసులు అంటించడంతో చర్చనీయాంశంగా మారింది.





## బీహార్‌లో కూలిన వంతెన తప్పిన ప్రమాదం

పట్నా,జూన్22 (ప్రజా మంటలు):
కొన్నేళ్లుగా వాడుకలో ఉన్న ఓ వంతెన ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటన బిహార్‌లో శనివారం చోటుచేసుకుంది. అయితే, ఇందులో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఈ వారంలో ఇది రెండో ఘటన కావడం గమనార్హం. బిహార్‌లోని సివాన్ జిల్లాలోని గండక్ కాలువపై ఉన్న వంతెన మహారాజ్‌గంజ్ జిల్లాలోని పటేధి బజార్ మార్కెట్‌ను, దర్భంగాలోని రామ్‌గఢ్ పంచాయతీతో కలుపుతోంది. ఈ వంతెనపై నుంచి ప్రతిరోజూ వందల మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. కాగా శనివారం ఉదయం ఇది భారీ శబ్దంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఈ వంతెన దాదాపు 40 సంవత్సరాల క్రితం నిర్మించిందని, దీని నిర్వహణ సరిగ్గా లేకపోవడం వల్లే కూలిపోయిందని, అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వంతెన కుప్పకూలడంతో గండక్ కాలువ మీదుగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో స్థానికులు పొరుగు గ్రామాలకు వెళ్లడానికి చాలా దూరం ప్రయాణించాల్సి వస్తుందని వాపోయారు. బిహార్‌లోని అరారియా జిల్లాలో బక్రా నదిపై రూ.కోట్లు ఖర్చుపెట్టి నిర్మించిన ఓ వంతెన ప్రారంభానికి ముందే కుప్పకూలింది. వారం రోజుల వ్యవధిలోనే రాష్ట్రంలో రెండు వంతెనలు కూలిపోవడంపై ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

## సునీతా విలియమ్స్ రాక మరింత ఆలస్యం

### వ్యోమనౌకలో సాంకేతిక సమస్యలు

వాషింగ్టన్,జూన్22 (ప్రజా మంటలు):
సాంకేతిక సమస్యల కారణంగా పలుమార్లు వాయిదాపడిన తర్వాత ఎట్టకేలకు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి అడుగుపెట్టారు భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్. ఆమెతో పాటు మరో వ్యోమగామి బుచ్ విల్‌మోర్‌లు ప్రయాణించిన బోయింగ్ స్టార్‌లైనర్ వ్యోమనౌక జూన్ 5న ఐఎస్ఎస్ కు చేరుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు వారి తిరుగు ప్రయాణానికీ సమస్యలు తలెత్తాయి. దీంతో ల్యాండింగ్ వాయిదా పడింది. 10 రోజుల మిషన్‌లో భాగంగా సునీత, విల్‌మోర్ ఈ రోదసి యాత్ర చేపట్టారు. జూన్ 14వ తేదీన వీరిద్దరూ భూమికి తిరుగుపయనం కావాల్సి ఉండగా.. స్టార్‌లైనర్ వ్యోమనౌకలో హీలియం లీకేజీ కారణంగా సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. దీంతో భూమిపై ల్యాండింగ్‌ను వాయిదా వేశారు. ఆ తర్వాత జూన్ 26న వీరు తిరుగు ప్రయాణం కానున్నట్లు నాసా ప్రకటించగా.. ఇప్పుడు మరోసారి వాయిదా పడింది. కొత్త తేదీని ఇంకా వెల్లడించలేదు. అన్నీ అనుకూలిస్తే జులై 2న వీరి రిటర్న్ జర్నీ ఉండొచ్చని నాసా అంచనా వేస్తోంది. అమెరికా అంతరిక్ష సంస్థ- నాసా వాణిజ్య కార్యక్రమంలో భాగంగా బోయింగ్ సంస్థ రూపొందించిన స్టార్‌లైనర్ ఇది. ఈ వ్యోమనౌకకు ఇదే తొలి మానవసహిత యాత్ర. ప్రయోగం సమయంలోనూ దీనికి పలు సాంకేతిక సమస్యలు తలెత్తాయి. హీలియం లీకేజీ కారణంగా గైడెన్స్-కంట్రోల్ థ్రస్టర్లలో ఇబ్బందులు ఎదురై వీరి అంతరిక్ష యానం పలుమార్లు వాయిదా పడింది. చివరకు జూన్ 5న ప్రయోగం విజయవంతంగా చేపట్టారు. అయితే, రోదసిలోకి వెళ్లిన తర్వాత కూడా కాస్త ఆలస్యంగా ఐఎస్ఎస్‌తో అనుసంధానం కాగలిగింది. సునీతా విలియమ్స్‌కు ఇది ముచ్చటగా మూడో రోదసి యాత్ర. గతంలో ఆమె 2006, 2012లో ఐఎస్ఎస్‌కు వెళ్లారు. మొత్తం 50 గంటల 40 నిమిషాల పాటు స్పేస్‌వాక్ నిర్వహించారు. 322 రోజుల పాటు అంతరిక్షంలో గడిపారు. ఐఎస్ఎస్‌లో ఓసారి మారథాన్ కూడా చేశారు. ఈసారి అంతరిక్ష కేంద్రంలోకి వెళ్లగానే ఆమె ఆనందంతో డ్యాన్స్ చేసిన వీడియో వైరల్ అయ్యింది.





## పేరును మార్చుకున్నా.. విధానం మాత్రం మారలేదు

### తండ్రి ముద్రగడ తీరుపై కూతరు క్రాంతి విమర్శలు

రాజమహేంద్రవరం,జూన్22(ప్రజా మంటలు):
'మా తండ్రి ముద్రగడ పద్మనాభం ఇటీవల తన పేరును పద్మనాభరెడ్డిగా మార్చుకున్నారు. ఆయన ఆలోచనా విధానం మాత్రం మార్చుకోకపోవడం ఆందోళనగా ఉంది' అని ఆయన కుమార్తె క్రాంతి.. 'ఎక్స్'లో పేర్కొన్నారు. మాజీ మంత్రి ముద్రగడ ఇటీవల జనసేనాని పవన్ కల్యాణ్‌పై సవాలు విసిరి ఓటమి చెందిన నేపథ్యంలో తన పేరు మార్చుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా క్రాంతి స్పందిస్తూ.. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఎప్పుడూ ప్రశ్నించని తన తండ్రికి పవన్‌కల్యాణ్‌ను ప్రశ్నించే అర్హత ఉందా? అని నిలదీశారు. పేరు మార్చుకున్నాక కాపుల గురించి, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గురించి ఆయనకు ఎందుకని ప్రశ్నించారు. సమాజానికి ఏం చేయాలో పవన్‌కల్యాణ్‌కు స్పష్టత ఉందని, తన తండ్రికి మాత్రమే లేదని అనిపిస్తోందని అన్నారు. శేష జీవితాన్ని ఇంటికే పరిమితం చేసి విశ్రాంతి తీసుకోవాలని సలహా ఇస్తున్నానని, మరో దఫా పవన్‌కల్యాణ్‌ను విమర్శిస్తే గట్టిగా ప్రతిఘటిస్తానని క్రాంతి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# అయ్యన్న ఎంపికతో సభకు హుందాతనం



**సుదీర్ఘ రాజకీయ అనుభవంతో ప్రత్యేక ముద్ర**

**గౌరవసభగా ఇక మంచి నిర్ణయాలకు ఆస్కారం**

**రాజధాని, పోలవరం, నదుల అనుసంధానం జరగాలి**

**అయ్యన్న నేతృత్వంలో సభలో మంచి నిర్ణయాలు తీసుకోవాలి**

**స్పీకర్‌ను అభినందిస్తూ సిఎం చంద్రబాబు ప్రసంగం**

అమరావతి,జూన్22 (ప్రజా మంటలు):
ఎపి శాసనసభ సమావేశాలు రెండోరోజు శనివారం స్పీకర్ ఎన్నికతో ప్రారంభం అయ్యాయి. స్పీకర్‌గా అయ్యన్న పాత్రుడి ఎన్నికను సభ్యులు అభినందించారు. ఆయన స్పీకర్‌గా ఇక సభను హుందాగా నడిపించాలని, గౌరవసభ ముందుకు తీసుకుని వెళ్లాలని ఆకాంక్షించారు. ఈ క్రమంలో సిఎం చంద్రబాబు తొలుత మాట్లాడుతూ...అసెంబ్లీలో అత్యంత సీనియర్ సభ్యుల్లో అయ్యన్న పాత్రుడు ఒకరని అన్నారు. స్పీకర్‌గా అయ్యన్న ఎన్నిక అనంతరం ఆయన మాట్లాడారు. అందరి ఆమోదంతో ఏకగ్రీవంగా ఎన్నిక కావడం సంతోషమన్నారు. ఎన్టీఆర్ పిలుపుతో 25 ఏళ్ల వయసులో అయ్యన్నపాత్రుడు రాజకీయాల్లోకి వచ్చారని తెలిపారు. 7 సార్లు ఎమ్మెల్యే, ఒకసారి ఎంపీగా ఎన్నికయ్యారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రిగా తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక ముద్ర వేశారని కొనియాడారు. ఏ పదవి ఇచ్చినా వన్నె తెచ్చారని పేర్కొన్నారు. 66 ఏళ్ల వయసు ఉన్నా అయ్యన్న ఇప్పటికీ ఫైర్ బ్రాండే. నీతి, నిజాయతీ, నిబద్ధతను పుణికి పుచ్చుకొని రాజకీయాలు చేశారు. గత ఐదేళ్లుగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. ఆయనపై అనేక పోలీసు స్టేషన్లలో కేసులు పెట్టి వేధించారు. 23 కేసులు పెట్టినా రాజీలేని పోరాటం చేశారు. ఆయన చట్టసభకు రావడం అరుదైన గౌరవం. మనందరిపై పవిత్ర బాధ్యత ఉందని గుర్తుంచుకోవాలి. సమర్థంగా పనిచేస్తే గౌరవం దానంతట అదే వస్తుందని బాబు అన్నారు. ఎంతో పవిత్రమైన అసెంబ్లీని గత ప్రభుత్వం దెబ్బ తీసింది. 23 మంది గెలిచి అసెంబ్లీకి వస్తే చాలా ఇబ్బంది పెట్టారు. నా కుటుంబం గురించి ఇష్టానుసారం మాట్లాడారు. మైకు ఇవ్వకుండా చేసి అవమానపరిచారు. సీఎంగానే అసెంబ్లీకి వస్తానని ఆరోజే గట్టిగా చెప్పా. కౌరవ సభకు రాను.. గౌరవ సభకే వస్తానని స్పష్టం చేశా. రాష్ట్రంలోని ఆడపడుచులను అవమానిం చారు. సోషల్‌మీడియాలో ఇష్టానుసారం పోస్టులు పెట్టారు. ప్రజలు అంతా గమనించి నన్ను గౌరవసభకు పంపారు. భవిష్యత్తులో ఏ ఆడబిడ్డకు అవమానం జరగకుండా చూడాలి. నా గౌరవాన్ని కాపాడిన ప్రజానీకానికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. మరో జన్మ ఉంటే తెలుగువాడిగానే పుట్టాలి. తెలుగు గడ్డ రుణం తీర్చుకోవాలనేదే నా కోరికని అన్నారు. ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో సీఎం హోదాలో చంద్రబాబు తొలిసారి శనివారం ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఎక్కడ తగ్గాలో.. ఎక్కడ నెగ్గాలో తెలిసిన వ్యక్తి పవన్ అని ప్రశంసల జల్లు కురిపించారు. పవన్‌ను అసెంబ్లీ గేటు తాకనీయబోమన్నారని, కానీ పవన్ పోటీ చేసిన 21 చోట్ల గెలిచారని చంద్రబాబు అన్నారు. ఆనాడు 23 సీట్లు వస్తే దేవుడు రాసిన స్క్రిప్ట్ అని హేళన చేశారు. నేడు కూటమికి 164 సీట్లు వచ్చాయి.. ఇది దేవుడు రాసిన స్క్రిప్ట్. పవన్‌ను అసెంబ్లీ గేటు కూడా తాకనీయమని విమర్శించారు. పోటీ చేసిన 21 స్థానాల్లో పార్టీని గెలిపించిన వ్యక్తి పవన్. ఎక్కడ తగ్గాలో .. ఎక్కడ గెలవాలో తెలిసిన వ్యక్తి పవన్. వైకాపా వైనాట్ 175 అని చెప్పి 11 సీట్లు తెచ్చుకున్న పరిస్థితిని చూశాం. గత ఐదేళ్లు తాను ఎంతో బాధపడ్డానని అన్నారు. గత ఐదేళ్లుగా శాసనసభలో జరిగిన సంఘటనలు చూసి బాధపడ్డానని అన్నారు.గత సభలో అసెంబ్లీని వాకౌట్ చేసేటప్పుడు చేసిన ప్రకటనను ఈ సందర్భంగా చంద్రబాబు గుర్తు చేశారు. కౌరవ సభలో తాను ఉండబోనని, సీఎంగానే సభలో అడుగుపెడతానని చెప్పానని గుర్తుచేశారు. తన కుటుంబ సభ్యులపై వైసీపీ సభ్యులు అమర్యాదగా మాట్లాడారని చంద్రబాబు గుర్తుచేశారు. వైసీపీ పాలనలో ఎంతోమంది మహిళలు బాధపడ్డారని, గౌరవసభగా శాసనసభను నడిపిస్తానని ప్రజలకు మాట ఇచ్చానని, రాష్ట్రంలో ఆడబిడ్డలకు వైసీపీ పాలనలో జరిగిన అవమానం ఇంకెప్పుడూ ఈ సభలో జరగకూడదని చంద్రబాబు అన్నారు. అవతలి పార్టీ సభ్యులను ఎగతాళి చేయాల్సిన అవసరం లేదని చంద్రబాబు అన్నారు. వైసీపీ సభ్యులను సభలో గౌరవించాలని అన్నారు. ఈ సభలో హుందాతనంతో ముందుకు వెళ్లాలని, వెకిలితనం, వెకిలి మాటలకు ఇక స్వస్తి అని చంద్రబాబు స్పష్టం చేశారు. చట్ట సభలు విలువ తెలిసిన వ్యక్తి అయ్యన్న పాత్రుడని, ఆయన నాయకత్వంలో సభ హుందాతనం పెరుగుతుందని ఆశిస్తున్నట్టు చంద్రబాబు విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్రం అభివృద్ధి విషయానికి వస్తే రాజధాని కట్టాలని, అలాగే పోలవరం నిర్మాణంతో పాటు నదుల అనుసంధానం, పేదల అభివృద్ధి వంటి కార్యక్రమాలు ఈ సభలోనే చేపట్టాలని చంద్రబాబు ఆకాంక్షించారు.'నేను శాసనసభలో సీనియర్ సభ్యుడిని. మొత్తం 16 సభలు జరగ్గా 9 సభల్లో ఉన్నాను. 9 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాను. నా జీవితంలో 15వ శాసనసభలో జరిగినట్లు ఎప్పుడూ జరగలేదు. సభ గౌరవాన్ని పెంచేలా సభ్యులు వ్యవహరించాలి. అయ్యన్నపాత్రుడు నేతృత్వంలో సభ హుందాగా నడుస్తుందనే నమ్మకం ఉంది. రాజ్యాంగ స్ఫూర్తిని అయ్యన్న కాపాడతారు' అని చంద్రబాబు అన్నారు.

## మీ అనుభవంతో సభకు హుందాతనం

**మంచి నిర్ణయాలు తీసుకునే సత్తా మీకుంది**

**అందరిపాత్రుడు ఆయన అంటూ..లోకేశ్ అభినందన**

అమరావతి,జూన్22 (ప్రజా మంటలు):
ఎప్పుడూ ప్రజల గురించి ఆలోచించే వ్యక్తి అయ్యన్న. ఏడుసార్లు ఎమ్మెల్యేగా మీకు చాలా అనుభవం ఉంది. మీ నాయకత్వంలో అనేక మంచి పనులు జరిగాయి. నాకు ఎప్పుడూ సలహా కావాలన్నా మీతో సంప్రదించా. ఒకే పార్టీ.. ప్రజలే అజెండాగా ముందుకెళ్లిన వ్యక్తి అయ్యన్న. అనేక అక్రమ కేసులు పెట్టి వేధించినా ఆయన భయపడలేదని మంత్రి నారా లోకేశ్ అన్నారు. అయ్యన్నపాత్రుడు అంటే అందరి పాత్రుడని మంత్రి నారా లోకేష్ అన్నారు. స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవ ఎన్నిక అనంతరం శాసనసభలో లోకేష్ మాట్లాడుతూ.. ప్రజల కోసం నిరంతరం పోరాడిన వ్యక్తి అయ్యన్న పాత్రుడని కొనియాడారు. 25 ఏళ్ల వయసులో మంత్రిగా ఎన్నికయ్యారన్నారు. 16 ఏళ్లు మంత్రిగా పని చేసిన అనుభవం అయ్యన్నపాత్రుడికి ఉందన్నారు. ఒకే పార్టీ.. ఒకే జెండా.. ప్రజల అజెండాగా ముందుకెళ్లిన నాయకుడు అయ్యన్నపాత్రుడని పేర్కొన్నారు. అయ్యన్న పాత్రుడిపై గత వైసీపీ ప్రభుత్వం కక్షకట్టిందని నారా లోకేష్ తెలిపారు. య్యన్నపాత్రుడిపై గత వైసీపీ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వేధించిందని లోకేష్ గుర్తు చేశారు. రాజకీయాలు చూస్తూ పెరిగిన వ్యక్తిని తానని.. గతంలో సభ ఎంతో హుందాగా జరిగేదన్నారు. గత ఐదేళ్లు శాసనసభపై గౌరవం తగ్గేలా వైసీపీ వ్యవహరించిందన్నారు. సభ సంప్రదాయాలను గౌరవించేలా.. సభ ప్రతిష్ట పెరిగేలా సభ్యులను గైడ్ చేయాలని స్పీకర్‌ను లోకేష్ కోరారు. ప్రతిపక్ష హోదా లేకపోయినా.. సభలో ప్రతిపక్షం లేకపోయినా.. మనమే ప్రతిపక్షంగా ప్రజల పక్షాన పోరాడాలన్నారు. అయ్యన్నపాత్రుడిపై ఎన్ని కేసులు పెట్టినా ధైర్యంగా నిలబడి పోరాడారన్నారు. అయ్యన్నపాత్రుడి నుంచి నేర్చుకోవల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయని నారా లోకేష్ అన్నారు.

## అక్రమంగా వైసిపి కార్యాయల నిర్మాణం

**అనుమతి లేదంటూ సిఆర్‌ఎడిఎ కూల్చివేత**

అమరావతి,జూన్22 (ప్రజా మంటలు):
గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం సీతానగరంలో వైకాపా కార్యాలయం కోసం అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న భవనాన్ని అధికారులు కూల్చివేశారు. నీటి పారుదల శాఖ స్థలంలో పార్టీ కార్యాలయం నిర్మాణాన్ని చేపట్టారు. బోట్ యార్డుగా ఉపయోగిస్తున్న స్థలాన్ని తక్కువ లీజుతో వైకాపా కార్యాలయం కోసం అప్పటి జగన్ సర్కార్ కట్టబెట్టింది. ఈ అక్రమ నిర్మాణంపై వైకాపాకు సీఆర్డీఏ నోటీసులు జారీ చేసింది. శనివారం ఉదయం అధికారులు కూల్చివేతలు చేపట్టారు.ఇరిగేషన్ భూమిని ఆక్రమించి, అనధికారికంగా వైకాపా కడుతున్న పార్టీ కార్యాలయ నిర్మాణాన్ని ఎంటీఎంసీ అధికారులు కూల్చివేశారు. అధికారం అండతో తాడేపల్లిలో 2 ఎకరాల ఇరిగేషన్ భూమిని పార్టీ కార్యాల యానికి జగన్ కేటాయించుకున్నారు. 2 ఎకరాల్లో భవనాలు కట్టి.. మిగిలిన 15 ఎకరాలు కొట్టేయడానికి వైకాపా నేతలు ప్రణాళిక సిద్ధం చేశారు. స్థలం స్వాధీనానికి ఇరిగేషన్ శాఖ అంగీకారం లేదు. సీఆర్డీఏ, ఎంటీఎంఈ, రెవెన్యూ శాఖలు ఈ భూమిని వైకాపాకు హ్యాండోవర్ చేయలేదు. వైకాపా కార్యాలయ నిర్మాణానికి కనీసం ఎలాన్ కోసం కూడా దరఖాస్తు చేయలేదు. నీటిపారుదల శాఖ భూమిని కబ్జా చేసి.. ఏ ఒక్క అనుమతి లేకుండా కార్యాలయ నిర్మాణం చేపట్టారు.

# స్పీకర్‌గా అయ్యన్న పాత్రుడు ఎన్నిక

**స్పీకర్ స్థానంలో కూర్చోబెట్టిన సిఎం, డిప్యూటి సిఎం**



అమరావతి,జూన్22 (ప్రజా మంటలు):
నవ్యాంధ్రప్రదేశ్ 3వ శాసనసభ సభాపతిగా చింతకాయల అయ్యన్న పాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయ్యన్న పేరును ప్రొటెం స్పీకర్ బుచ్చయ్య చౌదరి ప్రకటించారు. నూతన స్పీకర్‌గా అయ్యన్న బాధ్యతలు స్వీకరించారు. ఆయనను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ పక్షనేతలు సత్యకుమార్ తదితరులు గౌరవప్రదంగా సభాపతి స్థానంలో కూర్చోబెట్టారు. ఈ కార్యక్రమానికి వైసీపీ అధినేత జగన్ దూరంగా ఉన్నారు. అనకాపల్లి జిల్లా, నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా అయ్యన్నపాత్రుడు ఎన్నికయ్యారు. ఆయనకు నాలుగు దశాబ్దాలకుపైగా రాజకీయ అనుభవం ఉంది. 1983లో తెలుగుదేశం ఆవిర్భావంతో రాజకీయాల్లోకి అయ్యన్నపాత్రుడు ప్రవేశించారు. అప్పటి నుంచి పార్టీకి అన్ని విధాలుగా అండగా నిలిచారు. ఏడుసార్లు ఎమ్మెల్యేగా.. ఒకసారి ఎంపీగా అయ్యన్నపాత్రుడు విజయం సాధించారు. పట్టభద్రుడైన అయ్యన్నపాత్రుడు ఇప్పటి వరకూ అయిదు సార్లు మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. సాంకేతిక విద్య, క్రీడా, రహదారులు భవనాలు, అటవీ, పంచాయతీ రాజ్ వంటి కీలక శాఖల బాధ్యతలు నిర్వర్తించారు. 1983 నుంచి ఇప్పటివరకూ 10 సార్లు అసెంబ్లీ ఎన్నికల్లో, 2 సార్లు పార్లమెంట్ ఎన్నికల్లో అయ్యన్న పాత్రుడు పోటీ చేశారు.

# రాష్ట్ర ప్రజలు మీ హుందాతనం చూస్తారు

**ఈ ఐదేళ్లూ..వచ్చే భిష్యత్‌కు పునాది కావాలి - అయ్యన్నను అభినందిస్తూ ప్రసగించిన పవన్**



అమరావతి,జూన్22 (ప్రజా మంటలు):
సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న వ్యక్తి స్పీకర్‌గా రావడం సంతోషం అని స్పీకర్ అయ్యన్న పాత్రుడిని డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ అభినందించారు. ఇన్ని దశాబ్దాల్లో ప్రజలు మీ వాడివేడి చూశారు. ఇన్నాళ్లూ ప్రజలు మీ వాగ్దాటి చూశారు. ఇవాల్టి నుంచి రాష్ట్ర ప్రజలు మీ హుందాతనం చూస్తారు. గత ప్రభుత్వం వ్యక్తిగత దూషణలతో రాష్ట్ర పురోభివృద్ధిని ఆపేసింది. భాష మనసులను కలపడానికే.. విడగొట్టడానికి కాదు. ఎంత జఠిల సమస్య అయినా చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చు అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు.ఇన్నాళ్లు మీ వాడి వేడితో కూడిన మాటలు విన్నాం.. ఇక మీ నుండి అలాంటి మాటలు లేకపోయినా బాధ్యతతో మార్గం చూపించే మాటలు వింటాం. 2047 నాటికి ఏపీ ఉన్నతంగా వుండాలి అంటే ఇప్పుడే దానికి పునాది వెయ్యాలి. విభేదించడం, వాదించడం చర్చకు మూల సిద్దాంతాలు. అంతేగాని, దూషణలు, కొట్లాటలు కాదు. పొట్టి శ్రీరాములు చావుకు దగ్గర అవుతూ చేసిన ఒక్కో రోజు దీక్ష ఒకటిన్నర ఏళ్లకు సమానం. మహానుభావుడు, బ్రతికినప్పుడే కాదు చనిపోయి నప్పుడు కూడా అయన గుర్తుండాలి. ఈ విలువైన ఐదేళ్లు రాబోయే తరాలకు దిశా నిర్దేశం చేసేలా వుండాలి. పశువు, పక్షి, చెట్టు అన్నీ కూడా బావుండాలి అని కోరుకుంటూన్నాను.' అని పవన్ ఆకాంక్షించారు. డిప్యూటీ సీఎం, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్ తొలిసారిగా అసెంబ్లీలో మాట్లాడారు. స్పీకర్‌గా అయ్యన్న పాత్రుడు ఎన్నికైన వేళ పవన్ మాట్లాడారు. రిషికొండను గుండు కొట్టినట్టు ప్రత్యర్థులను విమర్శలతో గుండు కొట్టే సత్తా అయ్యన్నకు ఉంది. ఇకపై ప్రత్యర్థులను విమర్శించే అవకాశం ఆయనకు ఉండదు. కానీ అలా విమర్శలు చేసే వారిని వారించే బాధ్యత ఆయనకు ఉందన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న వ్యక్తి స్పీకర్‌గా రావడం సంతోషంగా ఉందన్నారు పవన్ కల్యాణ్. ఓటమిని ధైర్యంగా స్వీకరించే దమ్ము వైసీపీకి లేదన్నారు. అందుకే సభ నుంచి పారిపోయారని ఎద్దేవా చేశారు. ఇన్ని దశాబ్దాల్లో ప్రజల అయ్యన్న పాత్రుడిలో వాడీవేడి చూశారు ఇన్నాళ్లూ ఘాటైన వాగ్దాటి చూశారని అన్నారు. నేటి నుంచి రాష్ట్ర ప్రజలు మీ హుందాతనం చూస్తారని అయ్యన్నను ఉద్దేశించి కామెంట్ చేశారు. గత ప్రభుత్వంలో వ్యక్తిగత దూషణలు చాలా ఇబ్బంది పెట్టాయని పవన్ తెలిపారు. భాష మనసులను కలపడానికి ఉండాలే తప్ప విడగొట్టడానికి కాదని అభిప్రాయపడ్డారు. భాష విద్వేషం రేపడానికి కాదని గుర్తు చేశారు. సమస్యలు పరిష్కరించడానికి అని అన్నారు. ఎంత జఠిల సమస్య అయినా చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చని వివరించారు. గత ప్రభుత్వం వ్యక్తిగత దూషణలతో రాష్ట్ర పురోభివృద్ధిని ఆపేసిందని అన్నారు పవన్. ఇకపై సభలో వేసే ప్రతి అడుగు భవిష్యత్తు తరతరాలకు ఆదర్శంగా నిలవాలని అందుకే స్పీకర్ కీలక పాత్ర పోషించాలని అభిప్రాయపడ్డారు.

## పోలవరం నిర్మాణాన్ని సవాల్‌గా తీసుకోవాలి

**నిర్వాసితులను ఆదుకోవడంలో ముందుండాలి**

**చంద్రబాబుకు ప్రతిష్టాకంగా మారిన నిర్మాణం**

ఏలూరు,జూన్22 (ప్రజా మంటలు):
పోలవరం జాతీయ ప్రాజెక్ట్. దీనిని పూర్తి చేయాల్సిన బాధ్యత కేంద్రానిది. అలాగే సకాలంలో నిధులు విడుదల చేసి పూర్తి చయాల్సి ఉంది. విభజన జరిగి 10 ఏళ్లు పూర్తయ్యింది. అయినా సమస్యలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. సిఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టగానే గత సోమవారం పోలవరం సందర్శించి పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఇందులో ప్రధానంగా ప్రాజెక్టును పూర్తిచేయడంతో పాటు, అంతే చిత్తశుద్దితో పునరావాస చర్యలు తీసుకోవాలి. భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి గౌరవప్రదంగా పునరావాసం కల్పించాలి. పోలవరం నిర్వాసితులను ఆదుకోవడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది. ఈ క్రమంలో పోలవరం పోరుకేక చేపట్టి సమస్యలను ప్రబుత్వాల దృష్టికి తేవడంలో లెఫ్ట్ పార్టీలు బాగా కృషి చేశాయి. పోలవరం నిర్వాసితుల సమస్యలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేశారు. పోలవరం పోరుకేక నిర్వాసితుల్లో కొంత భరోసా కల్పించింది. పోలవరం అవకతవకలు లేదా నిధుల దుర్వినియోగం ఉంటే ఎపి ప్రభుత్వాన్ని నిలదీయవచ్చు. నిధుల దుబారాను అరికట్టవచ్చు. కానీ పోలవరం సందర్శించడం కూడా నేరంగా పరిగణించి దానిని జరుపకూడదన్న రీతిలో గత వైసిపి ప్రభుత్వం చంద్రబాబుపై ఆంక్షలు పెట్టడం అబివృద్దిని అడ్డుకోవడం తప్ప మరోటి కాదు. చంద్రబాబు మళ్లీ అధికారంలోకి వచ్చారు కనుక ఇప్పుడు పోలవరం ప్రధాన బాధ్యతగా తీసుకున్నారు. ఎపి అంటే అమరావతి, పోలవరం అన్న సంకల్పం తీసుకున్న చంద్రబాబు అందుకు అనుగుణంగా ముందుకు సాగాలి. ఇటీవలే పోలవరం నిర్మాణాలను పరిశీలించిన బాబు దాదాపు 70శాతం నిర్మాణాలు తన హయాంలోనే పూర్తి కావచ్చాయని ప్రకటించారు. చంద్రబాబు మొదటినుంచీ పోలవరం ప్రాజెక్టును ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. మాట నిలబెట్టుకోవడానికి సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఐదేళ్లయినా జగన్ పోలవరం పూర్తి చేయలేక పోయారు. కేంద్రంలో ఇప్పుడు చంద్రబాబు మళ్లీ చక్రం తిప్పే అవకాశం ఉంది. అందువల్ల పోలవరం నాలుగైదేళ్లలో పూర్తయ్యేలా యుద్ధప్రాతిపదికన ముందుకు సాగాల్సి ఉంది.

## కూరగాయల ధరలు పైపైకి

**అమాంతంగా పెరిగిన టమాటా ధరలు**

**తగ్గిన దిగుబడులతో ధరలకు రెక్కలు**

విజయవా,జూన్ 22 (ప్రజా మంటలు):
వర్షాభావంతో మార్కెట్లలో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. పంటల దిగుబడి తగ్గడంతో మార్కెట్‌లో కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి..వర్షాలు పడకపోవడంతో కొత్త పంటలకు ఇంకా సమయం ఉంది. రూ.100కు రెండు, మూడు కూరగాయలు కూడా రావడం లేదు. వ్యాపారులను అడిగితే పంట తగ్గిపోయిందని చెబుతున్నారు. ఒక పక్క ఎండ సెగ..మరో పక్క కూరగాయల ధరల మంట చూసి నగరవాసులు ఉసూరుమనాల్సి వస్తోంది.. ఎండల తీవ్రత కూరగాయల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపింది. కూరగాయలు పండించే రైతులకు నీరందక వందలాది ఎకరాల్లో పంట ఎండిపోయి దిగుబడి తగ్గిపోయింది. ఫలితంగా కూరగాయల ధరలు పెరిగిపోయాయి. ప్రజలు నిత్యం వినియోగించే టమాటా చుక్కలు చూపిస్తోంది. ఇప్పటికే మళ్లీ 50 నుంచి 75 రూపాయలకు చివరకు వంద కిలో పెరిగింది. నిత్యం వాడే ఉల్లి ధరలు మళ్లీ 35పైనే పలుకుతన్నాయి. ఎండాకాలంలో పంటల విస్తీర్ణం పరిమితమైంది. దిగుబడి కూడా సగానికి తగ్గి ఉత్పత్తి పడిపోయింది. దీంతో నగరానికి రావాల్సిన కూరగాయల దిగుబడి కూడా గణనీయంగా తగ్గిందని అంటున్నారు. వేసవి ప్రభావం తీవ్రంగా ఉండటంతో భూమిలోని తేమ గంటల వ్యవధిలో ఆవిరవడంతో పంటలకు నీరు అందని పరిస్థితి ఉంది. భూగర్భ జలాలు వేగంగా అడుగంటి పోవడంతో బోర్లు ఉన్నా పనిచేయడం లేదు. ఎండ తీవ్రతకు,వడ గాలులకు వచ్చిన పూత కూడా రాలిపోవడంతో కాయలుకాయడం లేదని అంటున్నారు. టమోటా క్రేటు (30కిలోలు) ధర గతంలో రూ. 200 నుంచి రూ.300 ఉండగా ఇప్పుడు రూ.1200 పలుకుతోంది. కాకర,బెండ,బీర, ధరలు పావుకు 30కి తక్కువగా లేవు. బీన్స్ వందకు పావు అమ్ముతున్నారు. అన్ని కూరగాయల ధరలు దాదాపు ఇదే తీరులో పెరిగాయి. టమోటా, బీర, గోరు చిక్కుడు సాగు చేసిన రైతులు అప్పు చేసి పెట్టుబడి పెట్టారు. తీరా ఇప్పుడిప్పుడే కాపు మొదలైందనుకున్న దశలో ఎండలకు ఉన్న పంట కాస్తా చేతికందకుండా పోతోంది. ఎండ తీవ్రత కారణంగా పంట ఎండిపోయిది. పెట్టుబడి కూడా చేతికి వస్తుందన్న నమ్మకం లేదని కూరగాయల రైతులు వాపోతున్నారు. ఎండల తీవ్రత ఇదే స్థాయిలో ఉండి, వర్షాలు పడకపోతే భూగర్భ జలాలు మరింత తగ్గిపోయి పంటలు ఎండిపోతాయి. ఇప్పటికే 80 శాతం కూరగాయల పంటలు ఎండిపోయే దశలో ఉన్నాయి. దిగుబడి ఇంకా పడిపోయి మార్కెట్‌కు కూరగాయలు రావడం కష్టమయ్యే పరిస్థితులు నెలకొని ఉన్నాయని నగర మార్కెట్లకు సరఫరా చేస్తున్న వ్యాపారులు అంటున్నారు. ఇలాగే ఎండలు కొనసాగితే ధరలు మరింతగా మండే ప్రమాదం కనిపిస్తోంది.



# రాజకీయ అగ్నిపథ్ పథకంపై చర్చించాలి !

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అగ్నిపథ్ పథకాన్ని రద్దుచేస్తామని ప్రకటించింది. అయితే అధికారంలోకి రాకున్నా ఇప్పుడు అతిపెద్ద పార్టీగా విపక్ష పార్టీ దీని రద్దు కోసం పోరాడుతామని కాంగ్రెస్ నేతలు ప్రకటించారు. ఈ క్రమంలో అగ్నిపథ్ పథకం రద్దు చేసి మిలిటరీలో యథావిధిగా రిక్రూట్‌మెంట్లు చేపట్టాల్సి ఉంది. ఇందుకు ప్రధాని మోడీయే ముందుగా చొరవ తీసుకోవాలి. అగ్నిపథ్ పథకాన్ని ఓ పెద్ద సంస్కరణగా ప్రధాని మోడీ అభివర్ణిస్తూ వచ్చారు. సంస్కరణలు భవిష్యత్‌లో మంచి ఫలితాలు ఇస్తాయని, కనుక వీటి వెనక ఆందోళనలకు వెరవాల్సిన అసవరం లేదని చెప్పుకొచ్చారు. అయితే ఇది ఏకపక్ష నిర్ణయమని అందరికీ తెలుసు. సంస్కరణలు తిండి పెట్టాలే తప్ప పస్తులుండేలా.. నిరుద్యోగాన్ని పెంచేలా..రోడ్డున పడేసేలా ఉండరాదు. నిజానికి దేశంలో రాజకీయ రిజర్వేషన్లు రావాలి. ఒక్కరు ఒక్కసారి మాత్రమే పదవి పొందేలా..అదికూడా దేశం కోసం ఎలాంటి జీతభత్యాలు లేకుండా పనిచేసేలా చేయాలి. రాజీకాయలను లాభసాటిగా మార్చి.. పదవులను పట్టుకుని వేలాడుతున్న వారు తమకు అనుకూలంగా చట్టాలు చేస్తూ పోతుంటే దేశం ఏమవు తుందో ఏనాడూ ఆలోచించడం లేదు. నిజానికి ఏటా రాజకీయ పదవుల కారణంగా ఎంత ఖర్చవుతుందో లెక్క తీయాలి. పెన్షన్లకు ఎంత ఇస్తున్నారో లెక్క తీయాలి. ఈ దుబారాను అరికట్ట గలిగితే దేశం తప్పకుండా బాగుపడు తుంది. ఆజాదీకా అమృత్ మహోత్సవాలు ఏటా జరుపుకోవచ్చు. దేశంలో ప్రజల ఆందోళనలు అర్థం చేసుకోకుండా పాలన సాగిస్తున్నంత కాలం దేశం ఎప్పటికీ కుదురు కోదు. ఓ వైపు అన్నమో రామచంద్రా అని ప్రజలు అల్లాడు తున్నా..ఆందోళను చేస్తున్నా ..నిరుద్యోగం పెరుగుతున్నా..నాలుగేళ్ల పేరుతో సైన్యంలో ఉద్యోగాలు కల్పిస్తే..వారికి దేశం మీద ఏపాటి భక్తి ఉంటుందో గమనించాలి. ప్రైవేట్ రంగం కూడా ఇదే విధానం అవలంబిస్తే దేశం ఏమవుతుందో ఊహించారా అన్నది మోడీ చెప్పాలి. అడుగ డుగునా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా.. దేశవ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు జరుగుతున్నా.. అన్నింటినీ తోసిరాజని 'అగ్నిపథ్'పై మోదీ ప్రభుత్వం అడుగు ముందుకే అన్న తీరుగా సాగుతున్న వైనం సరికాదు. ప్రభుత్వం ఇప్పుడు బిజెపిది కాదు. ఎన్‌డిఎది అని గుర్తించి, గతంలో తీసుకున్న నిర్ణయాలపై సమీక్షించాలి. సాగుచట్టాల విషయంలోనూ ఇదే విధానం ప్రకటించారు. మోడీ తన పాలనలో మంచి అంటున్న ఏ విషయంలో అయినా చర్చించరు. ఎలా మంచి జరుగుతుందో చెప్పరు. కనీసం తోటి మంత్రులతో అయినా చర్చిస్తారా అంటే చర్చించరు. పార్లమెంటును విశ్వాసంలోకి తీసుకోరు. సాగుచట్టాల విషయంలోనూ ఇదే జరిగింది. జివిఎస్టీ విషయంలోనూ ఇదే జరిగింది. నోట్ల రద్దు విషయం లోనూ ఇదే జరిగింది. లాక్‌డౌన్ విషయంలోనూ ఇదే జరిగింది. ఎందుకు..ఎలా అన్నదానికి సమాధానం దొరకదు. ఇలా ప్రభుత్వమే కాంట్రాక్ట్ విధానం అవలంబిస్తే ఇక ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించిన వారం అవుతామే తప్ప మరోటి కాదు. ఈ ప్రమాదాన్ని ప్రధాని గుర్తించడం లేదు. నాలుగేళ్ల పదవీకాలాన్ని ఎంపిలకు, ఎమ్మెల్యేలకు కూడా ప్రవేశ పెట్టి ఉంటే బాగుండేది. ఇలాంటి నిర్ణయాలపై ఇప్పుడు ఎన్‌డిఎ పునరాలోచన చేయాలి. 40 ఏళ్ల జీవితాన్ని నాలుగేళ్లలో ముగించండి అన్న మోడీ .. రాజకీయంగా కూడా నాలుగేళ్ల పరిమితులు పెడితే బాగుంటుంది. రాజకీయంగా ఎవరు కూడా నాలుగేళ్లకు మించి పదవిలో ఉండకుండా చట్టం చేయాలి. ఒక్కరు ఒకే దఫా పదవిలో ఉండాలి. ఎమ్మెల్యే కావచ్చు..ఎంపి కావచ్చు.. లేదా ప్రధాని కావచ్చు.. ఇలా చేసి ప్రయోగాత్మకంగా అవంబించాలి. అలాగే ప్రజాప్రతినిధుల పెన్షన్ ఎత్తేయాలి. వారికి ఇతరత్రా ఇస్తున్న అలవెన్సులు రద్దు చేయాలి. దేశం కోసం ప్రతి ఒక్కరూ ఓ నాలుగేళ్ల పాటు రాజకీయ అవకాశం పొందేలా చేయాలి. అప్పుడు దేశం కూడా బాగు పడుతుంది. అప్పుడు వారసత్వ రాజకీయాలను కూడా నిర్మూలించవచ్చు. రాజకీయాల్లో వారసత్వాలకు అవకాశం లేకుండా కూడా నిర్దేశించాలి. ఇదే పెద్ద సంస్కరణ కాగలదు. ఇది దేశ భవిష్యత్‌కు పునాది కాగలదు. రాజకీయంగా ఎలాంటి లాభాపేక్ష లేకుండా నాలుగేళ్ల పాటు ఎవరైనా సేవ చేసేలా రాజ్యాంగాన్ని సవరించాలి. పదవులను పట్టుకుని ఎంపిలుగా, ఎమ్మెల్యేలుగా వరుసగా నిలబడే విధానం పోవాలి. అప్పుడే అతిపెద్ద సంస్కరణ కాగలదు. మోడీ కూడా ఇలా పాటించి వుంటే అగ్నిఫత్ పథకంపై విమర్శలు వచ్చేవి కావు. అప్పుడు మోడీ సంస్కరణలపై ప్రజలకు విశ్వాసం కలుగుతుంది. ఇదే తరహాలో ఇప్పుడు రాష్ట్రపతి,ప్రధాని,మంత్రులు మొదలు, ఎంపిలు, ఎమ్మెల్యేలకు కూడా ఎన్నికల సంఘం ప్రత్యేక నోటిఫికేషన్ ఇవ్వాలి. పదవులను కుదించాలి. సాధారణ పౌరుడుగా ఉన్న వారెవరైనా వయోపరిమితి మేరకు ఎంపిగా,ఎమ్మెల్యేగా ఒక్కసారి మాత్రమే ..అదికూడా నాలుగేళ్లు మాత్రమే పదవిలో కొనసాగేలా అగ్నిపథ్ పథకాన్ని తీసుకునిరావాలి. అప్పుడే సంస్కరణలకు అర్థం ఉంటుంది. దేశ పురోభివృద్ధికి ఇది పునాది కాగలదు. దేశంలో అవినీతి తగ్గగలదు. ప్రజలకు మేలు చేసే నిర్ణయాలు రావచ్చు. ఎందరో త్యాగధనులు తమ ఆస్తిపాస్తులను అమ్ముకుని, త్యాగం చేసి దేశం కోసం పోరాడి స్వరాజ్యం తెచ్చారు. కానీ తరవాతి కాలంలో వచ్చిన వారు తమకు అనుకూలంగా చట్టాలు చేస్తూ పోతున్నారు. ప్రజలు పాలకులు కాళ్లా వేళ్లు పట్టుకునేలా చేస్తున్నారు. ప్రజలు అడుక్కునే బిచ్చగాళ్లుగా చూస్తున్నారు. దేశ సంపదను కొల్లగొడుతున్నారు. ప్రత్యేక విమానాలు, ప్రత్యే అలవెన్సులు, ఖర్చులు, విదేశీ పర్యటనలు ఇలా..చెప్పుకొంటూ పోతే లక్షల కోట్ల ధనం వృధా అవుతోంది. రాజకీయంగా ఖర్చు చేస్తున్న మొత్తాన్ని దేశ అవసరాలకు వినియోగించవచ్చు. రాజకీయ దుబారా అరికట్టగలిగితే దేశం సంక్షేమంతో ముందుకు సాగగలదు. అప్పుడు కర్షకులు బాగు పడతారు. ప్రజలు బాగుపడ తారు. దేశంలో నిరుద్యోగం ఉండదు. ఏటా నోటిఫికేషన్లు వస్తాయి. ధరలు దిగివస్తాయి. కాబట్టి ప్రజలంతా ముక్తకంఠంతో రాజకీయ అగ్నిపథ్ పథకం కోసం డిమాండ్ చేయాలి. అలా తీసుకుని వచ్చేలా పోరాడాలి. అప్పుడే దేశానికి దశదిశ ఏర్పడుతుంది.

# రాజధాని అమరావతికి వైద్యవిద్యార్థి విరాళం

**పొలం అమ్మి 25 లక్షలు అందించిన వైష్ణవి**

**పోలవరానికి మరో లక్ష విరాళం అందచేత**

**వైష్ణవి ఉదారతను అబినందించిన సిఎం చంద్రబాబు**


**అమరావతికి బ్రాండ్ అంబాసిడర్‌గా నియమిస్తూ ఆదేశాలు**



అమరావతి,జూన్22 (ప్రజామంటలు):

రాజధాని అమరావతికి రూ.25 లక్షల విరాళం ఇచ్చిన వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవిని సిఎం చంద్రబాబు అబినందించారు. పొలం అమ్మి రాజధానికి విరాళం ఇచ్చిన వైష్ణవి స్ఫూర్తిని అభినందించిన సీఎం చంద్రబాబురాజధాని అమరావతికి బ్రాండ్ అంబాసిడర్ గా వైష్ణవిని నియమించిన సిఎం చంద్రబాబు పోలవరం కోసం మరో రూ.1 లక్ష విరాళం ఇచ్చిన వైష్ణవిని ప్రశంసించారు. తండ్రితో కలిసి రెండు చెక్కులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేసారు. రాజధాని అమరావతి, రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి వైష్ణవి అనే వైద్య విద్యార్థిని విరాళం అందించారు. ఏలూరు జిల్లా, ముదినేపల్లికి చెందిన అంబుల వైష్ణవి శనివారం ఉండవల్లి నివాసంలో సీఎం చంద్రబాబు నాయుడుని లిసి విరాళం అందించారు. అమరావతి నిర్మాణానికి రూ.25 లక్షలు, పోలవరం ప్రాజెక్టుకు రూ.1 లక్ష చొప్పున విరాళం ఇస్తూ సీఎం చంద్రబాబుకు చెక్కు అందించారు. తమకున్న మూడు ఎకరాల భూమిలో ఎకరా అమ్మగా వచ్చిన రూ.25 లక్షలను రాజధానికి, తన బంగారు గాజులు అమ్మగా వచ్చిన రూ.1 లక్షను పోలవరానికి విరాళంగా అందించినట్లు వైష్ణవి తెలిపారు. రాజధానిని నిర్మిద్దాం, రాష్ట్రాన్ని అభివృద్ధి చేద్దాం అనే ఆలోచనతో పనిచేస్తున్న ప్రభుత్వానికి తనవంతుగా ఈ విరాళం ఇచ్చినట్లు ఆమె తెలిపారు. రాజధాని నిర్మాణం కోసం వైష్ణవి పొలం అమ్మి మరీ విరాళం ఇవ్వడం గొప్ప విషయం అని చంద్రబాబు అన్నారు. ప్రస్తుతం విద్యార్థిగానే ఉన్న వైష్ణవి....తండ్రి సహకారంతో రాజధాని కోసం, పోలవరం కోసం విరాళం ఇవ్వడం ఎంతో గొప్ప విషయం అన్నారు. నేటి యువతకు వైష్ణవి ఒక స్ఫూర్తిగా నిలుస్తుందని చంద్రబాబు అభిప్రాయ పడ్డారు. ఇలాంటి యువత కలలు తమ ప్రభుత్వం నిజం చేస్తుందని చంద్రబాబు అన్నారు. ఎటువంటి లాభాపేక్షలేకుండా ఇంత చిన్న వయసులో ఇంత గొప్ప మనుసు చాటిని వైష్ణవిని సీఎం శాలువా కప్పి సత్కరించారు. స్ఫూర్తి దాయకంగా నిలిచిన వైష్ణవిని సీఎం అమరావతికి బ్రాండ్ అంబాసిడర్ గా నియమిస్తున్నట్లు ప్రకటించారు. వైష్ణవి విజయవాడలోని ఓ మెడికల్ కాలేజ్ లో ప్రస్తుతం ఎంబిబిఎస్ సెకండ్ ఇయర్ చదువుతున్నారు. ఈ సందర్భంగా వైష్ణవితో పాటు, ఆమె తండ్రి అంబుల మనోజ్ ను సిఎం చంద్రబాబు అభినందించారు.

# ప్రకృతి పచ్చని బాట



ఆధునిక సాంకేతిక మోజులో అనాగరికంగా అడవులను నరుకుతూ, అవసరానికి మించి ప్లాస్టిక్ ను వినియోగిస్తూ, ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించే పద్ధతులు వాడకపోవడం,చెట్లను పెంచే నైతిక బాధ్యత ను విస్మరించడం మరియు భూగర్భ జలాలు ఇంకిపోవడం వంటి వివిధ కారణాల వల్ల ప్రశాంతతను పంచాల్సిన ప్రకృతి పర్యావరణం కలుషితమయ్యి నేడు సమస్త మానవాళిపై కన్నెర్ర చేసింది కుల,మత,వర్గ, వర్ణ, ప్రాంత,జాతులకు అతీతంగా.అందువల్లనే గ్రీన్ హౌస్ ఎఫెక్ట్, గ్లోబల్ వార్మింగ్, ప్రకృతి వైపరీత్యాలు మరియు వాతావరణంలో అనుకోని పెను మార్పులు,అధిక ఉష్ణోగ్రతలతో వడ గాలులు ఇలాంటివి ఎన్నో నేడు మానవ మనుగడనే ప్రశ్నిస్తున్నాయి. శాసిస్తున్నాయి.

నేడు త్రాగడానికి మంచినీరు,శ్వాసించడానికి ఆక్సిజన్ దొరకని ఆందోళనకర పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతుంది మనం గర్వంగా చెప్పుకునే 5%+% ప్రపంచం.ఏం సాధించాం?ఎంత పురోగమించాం?ప్రకృతితో పోటీపడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారంతో "ఆరడుగుల నేల"ను మరిచిపోతున్నాం.మనమంతా ఈ అవనిపై అతిథులం అనే శాశ్వత సత్యాన్ని కొందరం గ్రహించలేపోతున్నాం....తెలివి, డబ్బు వుందన్న అహంకార మదంతో..!

భవిష్యత్ తరాలకు బ్రతుకునీయాలంటే, బ్రతుకు వుండాలంటే ప్రపంచ దేశాలు,వాటి ప్రభుత్వాలు,పౌరులు సామాజిక బాధ్యతగా, మానవతావాదంతో ప్రకృతితో స్నేహం చేస్తూ పచ్చదనాన్ని పరిమళించేలా చేయాలి.మనం నాటే చెట్ల ఎదుగుదలే మానవ నాగరికత ప్రగతిగా భావించాలి.చెట్లను నాటినట్లు నటించడం మానేయాలి.ప్లాస్టిక్ వినియోగాన్ని బాగా తగ్గించాలి.జల వనరులను సంరక్షించాలి.అడవులను కాపాడుకోవాలి.సాంకేతికంగా ఎదుగుతూనే పర్యావరణం పరిరక్షణపై ప్రపంచదేశాలు కలిసి పనిచేయాలి.ప్రపంచ పర్యావరణ దినోత్సవం, ధరిత్రీ దినోత్సవం, పర్యావరణ దినోత్సవం వంటి రోజుల్లో ఉపాధ్యాయులు , అధ్యాపకులు, ప్రొఫెసర్లు, సామాజిక సేవకులు, మేధావులు,కవులు, కళాకారులు మరియు తదితరులు పాఠశాల స్థాయి నుంచి విశ్వ విద్యాలయాల స్థాయిలో విద్యాసంస్థల్లో విద్యార్థులకు వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు నెలకొల్పి ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా లో ప్రచారం చెయ్యాలి.

ప్రకృతి ప్రాణంతో వుంటేనే మనమంతా జీవంతో వుంటాము.లేదంటే ప్రకృతి ప్రదర్శించే విధ్వంసాన్ని ఆపడం అసాధ్యం."ప్రకృతి మన అవసరాలను మాత్రమే తీరుస్తుంది,మన అంతులేని కోరికలను కాదని" ఏనాడో మన మహాత్ముడు గాంధీజీ చెప్పిన మాటే నేడు ప్రపంచం నడవాల్సిన పచ్చని బాట.

**ఫిజిక్స్ అరుణ్ కుమార్**
**నాగర్ కర్నూల్, 9394749536**

## ఉస్మానియాలో జూడాల నిరసన

**- సమస్యలు పరిష్కరించాలని కళ్లకు గంతలతో ఆందోళన**



హైదరాబాద్ (ప్రజామంటలు): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా మెడికల్ కళాశాల జూనియర్ డాక్టర్లు నిరసన ప్రదర్శన నిర్వహించారు.కళ్లకు గంతలు కట్టుకొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్ల సంఘం అధ్యక్షుడు దీపాంకర్ మాట్లాడుతూ.. "అధికారుల చుట్టూ తిరగకుండా ప్రతి నెలా నిర్దిష్టమైన తేదీకి స్టైఫండ్ ఇవ్వాలని ఎప్పటి నుంచో కోరుతున్నాం. కానీ, ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు.ఉస్మానియా ఆసుపత్రి భవనం మూసి వేసి నాలుగేళ్లు అయ్యింది. పక్కనే ఉన్న మరో భవనంలోకి ఆసుపత్రి మార్చారు. విపరీతమైన రద్దీ కారణంగా ఇన్‌ఫెక్షన్ల శాతం పెరుగుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మా డిమాండ్లపై లిఖితపూర్వక హామీ ఇవ్వాలి" అని కోరారు.

# రోడ్డుపైనే జనసేనాని ప్రజా దర్బార్

**ప్రజల వినతులకు తక్షణ పరిష్కారం - అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఆదేశాలు**

**డిప్యూటి సిఎం పవన్ చొరవతో ప్రజల ఆనందం**

గుంటూరు,జూన్22 (ప్రజామంటలు): గుంటూరు జిల్లా మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయం వద్ద రోడ్డుపైనే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రజాదర్బార్ నిర్వహించారు. తాజాగా ఉప ముఖ్యమంత్రి గా పవన్ కల్యాణ్ బాధ్యతలు చేపట్టడం అటు అసెంబ్లీ సమావేశాల్లోనూ ఆయన పాల్గొనడంతో సమస్యలు చెప్పుకునేందుకు ప్రజలు జనసేన కార్యాలయానికి బారులు తీరుతున్నారు. జనసేన కార్యాలయానికి అప్పుడే వచ్చిన డిప్యూటీ సీఎం.. కారు నుంచి దిగి రోడ్డుపైనే కుర్చీలు వేయించి వారితో మాట్లాడారు.సమస్యలు విన్న పవన్ కల్యాణ్.. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అర్జీదారుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా బాధితులు తమ సమస్యలు చెప్పుకొని వాటిని తీర్చాలని కోరగా.. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి కొన్ని సమస్యలు తక్షణమే పరిష్కరించారు. మరికొన్ని సమస్యల పరిష్కారానికి కాల పరిమితి నిర్ణయించి ఆలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్డుపైనే ప్రజాదర్బార్ నిర్వహించి తమ సమస్యలు పరిష్కరించడంతో ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఓ బాలిక మిస్సింగ్ కేసులో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్వయంగా రంగంలోకి దిగారు. విజయవాడలో చదువుకుంటున్న తన కుమార్తె మైనర్ అని ఆమెను ప్రేమ పేరిట ట్రాప్ చేసి కిడ్నాప్ చేశారని, గత తొమ్మిది నెలలుగా ఆమె జాడ తెలియడం లేదని భీమవరం నుంచి వచ్చిన శివకుమారి అనే బాధితురాలు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ముందు కన్నీటితో మొరపెట్టుకుంది. మాచవరం పోలీస్ స్టేషన్‌లో దీనిపై ఫిర్యాదు చేశామని, తమ కూతురు జాడ తెలిసినా పోలీసులు స్పందించడం లేదని వేదన చెందారు. జాడ తెలిశాక కూడా తమ బిడ్డను తమకు అప్పగించడం లేదని ఈ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీని పరిశీలించిన వెంటనే, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాచవరం సీఐకి ఫోన్ చేసి కేసు వివరాలు తెలుసుకున్నారు. దీనిపై చర్యలకు ఆదేశించారు. పార్టీ నాయకులను, బాధితులను పార్టీ ఆఫీస్ వాహనంలోనే మాచవరం పోలీస్ స్టేషన్‌కు పంపించారు.

## కవిత్వం

### జ్ఞాపకాలు ..

మెదడు మొదల్లో
నాటుకుపోయినజి
జ్ఞాపకాలను
కూకటి వేళ్ళతో
పెకిలించినా సరే
జ్ఞాపకాల తాలూకు
అనుభూతులు
ఇంకా మిగిలే ఉన్నాయి
ఉంటాయి కూడా
ఎందుకంటే ?
అది మనిషి మెదడు
గనుక
అది ఆలోచించకుండా
ఉండలేదు గనుక !!

- ఏడుకొండలు
కళ్ళేపల్లి,
మచిలీపట్నం,
9490832338

## నీవే నా మంత్రి..

అమరావతి నగర సమీపంలోని కృష్ణానది తీరాన ఎగువున అరణ్యంలో సింహరాజు మంత్రి పదవి పోటీకి పలు రాష్ట్రాల జంతువులన్నీ పాల్గొనడానికి వచ్చాయి. అప్పుడే వచ్చిన సింహరాజు " మిత్రులారా ఈ మంత్రి పదవి పోటీకి వచ్చిన ఇతర రాష్ట్రాల వారు నేను అడిగే ప్రశ్నలకు వారి వారి మాతృభాషలో సమాధానం చెప్పవచ్చు నాకు చాలా భాషలు తెలుసు. మొదటి ప్రశ్న అక్కడ ఎండమండిపోతుంది తారురోడ్డు పైన చెప్పులు లేకుండా నడవటం అసాధ్యం, అక్కడ ఇద్దరు ఉన్నారు కాని చెప్పులు ఒకరికే ఉన్నాయి ఇద్దరు ఆతారురోడ్డుపైన నడిచి వెళ్ళాలంటే ఎలా? "అన్నాడు. ఎవ్వరూ సమాధానం ఇవ్వలేదు. చెట్టుదిగి వచ్చిన కోతి " ప్రభూ అక్కడ ఉన్న చెప్పులు తల్లి తన కాళ్ళకు వేసుకుని ఏడాది వయసు బిడ్డను చంకన ఎత్తుకుని ఆతారు రోడ్డుపైకి వెళితే ఇద్దరూ రోడ్డు పైకి వెళ్ళగలరు "అన్నాడు. అక్కడ ఉన్న జంతువులనీ కోతి తెలివిని తమ కూతల ద్వారా ఆనందం తెలిపాయి. " మరో ప్రశ్న ఆవు ఎలా ఉంటుంది " అన్నాడు సింహరాజు.

" ఆవు ఎలా ఉంటుందో అలానే ఉంటుంది.( పసుమాడు ఎప్పిడి ఇరుక్కుమో అప్పిడిదా ఇరుకుం ) అన్నాడు తమిళనాడు నుండి వచ్చిన కోతి. తమిళ కోతి మాటలకు నవ్వాడు సింహరాజు. ఎవ్వరు సమాధానం చెప్పక పోవడంతో " ప్రభు ఆవు ఒకచోట కట్టివేస్తె స్థరంగా అలా ఉంటుంది. కోతి సమాధానానికి అడవి జంతులన్ని ఆనందంగా తలలు ఊపాయి. " చెరువు ఎలా ఉంటుంది ?" అన్నాడు సింహరాజు." జీక్కనే జోల్ భర్తీ తాకిలే బోలా జాబే తలబ్, ఎక్కబార్ సీత్కాల్ దూకలే బుజజాబే. (ఎక్కడ నీళ్ళు ఎక్కువ ఉంటాయో అదే చెరువు. ఒకసారి చలికాలం దిగుతే చెరువు ఎలా ఉంటుందో తెలుస్తుంది.)" అన్నది బెంగాలి భాషలో కాకి.

బెంగాలి కాకి తెలివికి నవ్వాడు సింహరాజు.( పాన్యాని భర్లేలా జాగాల తలావ్ మన్తో...నీటితో నిండి ఉన్న చోటును చెరువు అంటారు..) అన్నది మరాఠి రామచిలుక. " ప్రభూ నీళ్ళు వెలుపలకు పోకండా కట్టవేస్తేనే చెరువు స్థరంగా ఉంటుంది" అన్నాడు తెలుగు కోతి.

" ఏప్రాణికైనా అన్నింటికన్న ముఖ్యమైనది సుఖంగా జీవించడానికి అవసరమైనది ఏది? " హణ ఈద్దరే ఎల్లావు తానాగి బరుత్తవే " అన్నది కన్నడ కాకి. కాకి సమాధానానికి " ధనం ఉంటే అన్ని వస్తాయి ఇది మనుషులకు మరి మిగిలిన ప్రాణకోటికి ధనం అవసరం లేదుకదా ? "అన్నాడు సింహరాజు.

" ప్రభు ఏప్రాణికైనా ఉన్నంత లో తృప్తి చెందాలి అప్పుడే సుఖ శాంతులతో జీవించగలం. అత్యాశ ప్రమాదకరమైనది అనుక్షణం మనల్ని వేధిస్తుంది "అన్నాడు తెలుగుకోతి.

" తెలుంగుకార్ కి మూల అధికం " ( తెలుగు వారికీ తెలివి అధికం)అన్నాడు తమిళ కోతి.

"యదార్థం నాప్రశ్నలకు సరైన సమాధానాలు తెలిపిన కోతి నీవే నామంత్రి" అన్నాడు సింహరాజు.

**బెల్లంకొండ నాగేశ్వరరావు.**
**చెన్నయ్ .9884429899**





కథల రచయితలకు ఆహ్వానం
గత రెండున్నర సంవత్సరాలుగా "ప్రజా మంటలు" జాతీయ దినపత్రికలో ప్రతిరోజూ ఒక పిల్లల కథను ప్రచురిస్తున్నవిషయం తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాలలోని పేరున్న రచయితలతో పాటుగా, కొత్త రచయితలు, విద్యార్థులు కూడా తమ కథలను పంపుతున్నారు. ఒక రచన ప్రచురించడానికి కనీసం 20-30 రోజులు పడుతుందని గ్రహించండి. ప్రచురణ విషయంలో ఉత్తరప్రత్యుత్తరాలకు తావు లేదు. మీ రచనలను నెట్ ప్రయిబ్ చేసుకొని www.prajamantalu.com లో ప్రతి రోజు చదువుకోండి. మీరు కూడా మీ కథలను హామీ పత్రంతో, ఈమెయిల్ కు పంపండి.
mantalukathalu@gmail.com



# తెలంగాణ అభివృద్ధిని దెబ్బతీసిన కాళేశ్వరం

## ప్రాజెక్టులపై సమగ్ర విచారణ జరగాలి

### రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

హైదరాబాద్,జూన్22 (ప్రజామంటలు):

'కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ అభివృద్ధిని చావు దెబ్బతీసిందని వక్తలు అన్నారు. సివిల్ కోర్టుకు ఉన్న అధికారాలు జుడీషియల్ కమిషన్‌కు ఉన్నాయి. మొత్తం ప్రాజెక్టుపై సమగ్ర న్యాయవిచారణ జరిపించాలి. తప్పుల తడక డిజైన్లకు ఎలా అనుమతి చ్చారు. ఇరిగేషన్ అంటేనే మాఫియాగా మారింది' అని పలువురు వక్తలు ఆరోపించారు. 'జుడీషియల్ కమిషన్‌లను బెదిరించే కేసీఆర్ భూస్వామ్య రాచరిక విధానాలను ఖండించండి, మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరిపించండి' అంటూ తెలంగాణ జలసాధన సమితి, తెలంగాణ రైతుసంక్షేమ సమితిల ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది.సమితి అధ్యక్షుడు నైనాల గోవర్ధన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం వేసిన జుడీషియల్ కమిషన్ విచారణ ప్రభుత్వం రిఫరెన్స్ చేసిన విషయాల వరకు మాత్రమే పరిమితం అవుతుందని అన్నారు. జుడీషియల్ కమిషన్ అంటే సివిల్ కోర్టుకు ఉన్న అధికారాలు ఉంటాయని అన్నారు. న్యాయనిపుణుల సలహా తీసుకుని ఒక క్రిమినల్ ఫిర్యాదును తయారు చేసి సీఎంకు, డీజీపీకి, ఏసీబీకి పంపిద్దామని అన్నారు. కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో ఎన్డీఏ, టీఆర్ఎ?స, బీఆర్ఎస్ ప్రభుత్వాలు అనేక విషయాల్లో ఎవరినీ సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నాయని ఆరోపించారు. సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వేములపల్లి వెంకట్రామయ్య మాట్లాడుతూ ప్రపంచంలో అద్భుతమైన ప్రాజెక్టు అని చెప్పుకుంటున్న కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ అభివృద్ధిని చావు దెబ్బతీసిందని ఆరోపించారు.అసలు ప్రాజెక్టుకు ఎవరు అనుమతి ఇచ్చారు అని నీటిపారుదల విశ్లేషకులు సాంబశివరావు ప్రశ్నించారు. తప్పుల తడక డిజైన్లు, తడక లాంటి నిర్మాణాలు, వర్షం పడితే కొట్టుకు పోతాయని సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి అన్నారు. ఇరిగేషన్ అంటే మాఫియాగా మారిందని, ఇక్కడి డబ్బుతో ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోమాలోకి పోయిందని నైనాల గోవర్ధన్ అన్నారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు అన్వేష్‌రెడ్డి, దొంతి నర్సింహారెడ్డి, తెలంగాణ ప్రజా చైతన్య వేదిక చైర్మన్ ప్రొఫెసర్ కె.వెంకట్‌నారాయణ, బీఎల్ఎఫ్ చైర్మన్ నల్ల సూర్యప్రకాష్, పృథ్వీరాజ్‌యాదవ్ విఠల్, సోగరా బేగం, నరసింహ, సూర్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు.



### జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లను సన్మానించిన ఎమ్మెల్యే జడ్పీ చైర్పర్సన్

జగిత్యాల జూన్ 22(ప్రజా మంటలు)

జగిత్యాల జిల్లా కలెక్టర్ గా పనిచేసిన యాస్మిన్ భాషా ,అడిషనల్ కలెక్టర్ గా పనిచేసిన దివాకర్ బదిలీ పై వెళ్తున్న సందర్భంగా కలిసి మెమెంటో అందజేసి సన్మానించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ , జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్ పాల్గొన్నారు.



### బదిలీపై వెళ్తున్న జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ ను ఎమ్మెల్యే తో కలిసి సన్మానించిన జెడ్పి చైర్ పర్సన్

జగిత్యాల జూన్ 22 ( ప్రజా మంటలు)

జగిత్యాల జిల్లా కలెక్టర్ గా పనిచేసిన యాస్మిన్ భాషా ,అడిషనల్ కలెక్టర్ గా పనిచేసిన దివాకర్ బదిలీ పై వెళ్తున్న సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ తో కలిసి సన్మానించిన జగిత్యాల జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్ ఈ సందర్భంగా జగిత్యాల జిల్లాకు వారు చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు...వెంట జెడ్పీ సీఈఓ రఘువరణ్ ఉన్నారు...

# చైనాలో భారీగా వరదలు

## వర్షాలతో 47మంది మృత్యువాత



న్యూఢిల్లీ,జూన్ 22 (ప్రజామంటలు):

చైనాను మరోసారి వరదలు (అరతినిజీ ఈ్గ÷నీనీటబ) ముంచెత్తాయి. కుండపోత వర్షాల కారణంగా దక్షిణ చైనాలో వరదలు పోటెత్తాయి. భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడుతున్నాయి. పలు చోట్ల భారీగా చెట్లు నేలకూలాయి. ఇళ్లు ధ్వంసమయ్యాయి. ప్రధాన రహదారులు ఎక్కడికక్కడ కొట్టుకుపోయాయి. ఈ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది. గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్ లో కొండచరియలు విరిగిపడిన ఘటనలో 47 మంది ప్రాణాలు కోల్పోయినట్లు చైనా మీడియా వెల్లడించింది. పదుల సంఖ్యలో ప్రజలు గాయపడినట్లు పేర్కొంది. ఈ జల విలయంతో భారీగా పంట నష్టం వాటిల్లింది. చాలా చోట్ల రోడ్లు కొట్టుకుపోయాయి. విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల వరద ప్రవాహానికి కార్లు కొట్టుకుపోయాయి. వరదల కారణంగా అప్రమత్తమైన అధికారులు రంగంలోకి దిగారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ వరదలకు భారీగా ఆస్తి నష్టం సంభవించినట్లు చైనా మీడియా వెల్లడించింది.

# తరచూ పేపర్ల లీకేజీతో కేంద్రం దిద్దుబాటు

## పరీక్షల నిర్వహణ ప్రక్రియలో సంస్కరణలు

### ఇస్రో మాజీ చైర్మన్ రాధాకష్ణన్ కమిటీ ఏర్పాటు

న్యూఢిల్లీ,జూన్ 22 (ప్రజామంటలు):




నీట్ యూజీ, యూజీసీ నెట్ పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీకేజీపై పెనుదుమారం కొనసాగుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం ఓ కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షల నిర్వహణ పక్రియలో సంస్కరణల కోసం ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటుచేసింది. ఏడుగురు సభ్యులుండే ఈ కమిటీకి ఇస్రో మాజీ చీఫ్ కె.రాధాకృష్ణన్ నేతృత్వం వహించనున్నట్లు తెలిపింది. ఈ కమిటీలో ఎయిమ్స్ దిల్లీ మాజీ డైరెక్టర్ డా.రణ్‌దీప్ గులేరియా, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.జె.రావు, ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ కె.రామమూర్తి, కర్మయోగి భారత్ సహ వ్యవస్థాపకుడు పంకజ్ బన్సల్, ఐఐటీ దిల్లీ డీన్ (విద్యార్థి వ్యవహారాలు) ప్రొఫెసర్ ఆదిత్య మిత్తల్, కేంద్ర విద్యాశాఖ జాయింట్ సెక్రటరీ గోవింద్ జైశ్వాల్ సభ్యులుగా ఉన్నారు. ప్రవేశపరీక్షల నిర్వహణ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉండటం కోసం ఈ కమిటీని ఏర్పాటుచేసినట్లు కేంద్ర విద్యాశాఖ వెల్లడించింది. పరీక్షల నిర్వహణ విధానంలో సంస్కరణలు, డేటా సెక్యూరిటీ ప్రొటోకాల్స్‌లో పురోగతి, జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ పనితీరుపై ఈ కమిటీ తగిన సిఫార్సులు చేయనుంది. రెండు నెలల్లోగా తన నివేదికను సమర్పిస్తుందని కేంద్రం తెలిపింది. ఇటీవల నీట్, నెట్ ప్రవేశపరీక్షల ప్రశ్నపత్రాలు లీక్ అవడం తీవ్ర వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే కేంద్రం తాజాగా ది పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) యాక్ట్ 2024ను అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం ఎవరైనా చట్టవిరుద్ధంగా పరీక్ష పేపర్లను అందుకున్నా, ప్రశ్నలు, జవాబులను లీక్ చేసినా నేరంగా పరిగణిస్తారు. బాధ్యులకు 5 నుంచి 10 ఏళ్ల వరకు జైలుశిక్ష, రూ.కోటి వరకు జరిమానా విధించే వీలుంది.

# సింగరేణికి అండగా ఉంటా

## అనవసరంగా విమర్శలు చేస్తే సహించం

## సింగరేణిని మభ్య పెట్టి లబ్ది పొందిన బిఆర్ఎస్

## కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్, జూన్ 22 (ప్రజామంటలు):

కేంద్రమంత్రిగా సింగరేణికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని కిషన్‌రెడ్డి తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'సింగరేణి కార్మికులకు అన్ని రకాలుగా అండగా ఉంటానని అన్నారు.న సింగరేణిని రక్షించాల్సిన బాధ్యత 49 శాతం వాటా ఉన్న కేంద్రంపై కూడా ఉంది. ఆ సంస్థకు లాభం చేకూర్చే పని కేసీఆర్, కేటీఆర్, భారాస ప్రభుత్వం ఏనాడూ చేయలేదన్నారు. ఉద్యోగులకు, కార్మికులకు సొంత ఇంటి పథకం అంటూ మభ్యపెట్టారు. వైద్య సదుపాయం, కాంట్రాక్ట్ కార్మికుల రెగ్యులరైజ్, కోల్ ఇండియా కార్మికుల తరహా జీతాలు వంటి హామీలన్నీ తుంగలో తొక్కారు. తెలంగాణ బిడ్డగా సింగరేణి ప్రయోజనాలే నాకు ముఖ్యం. వేర్వేరు రాష్ట్రాల్లో ఏ ప్రభుత్వం ఉన్నా సరే సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని అన్నారు. రానున్న రోజుల్లో మనం కూడా ఆత్మనిర్భర్‌ను స్ఫూర్తిగా తీసుకొని సొంత కాళ్లపై నిలబడాలి. దేశంలో బొగ్గు ఉత్పత్తి మరింత పెరగాల్సి ఉంది. ఆ దిశగా నరేంద్రమోదీ ప్రభుత్వం పనిచేస్తోంది. అభివృద్ధికి అడ్డుపడొద్దని ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేస్తున్నా. త్వరలోనే సింగరేణికి సంబంధించిన అన్ని అంశాలపై సమీక్ష నిర్వహిస్తా. కోల్ ఇండియా కూడా వేలంలో పాల్గొంటోంది. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం చట్టం చేశాం. రాష్ట్రంలోని బొగ్గు గనులకు వేలం వేసుకోవాలని కేంద్రం ఎన్నోసార్లు చెప్పినప్పటికీ పట్టించుకోలేదు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రూ.2వేల కోట్ల ఆదాయం కోల్పోయాం. చట్టంతో మాకేం సంబంధం అని ఇవాళ భారాస నేతలు మాట్లాడుతున్నారు. చట్టం చేసిన సమయంలో వారు సభలోనే ఉన్నారు. దానికి మద్దతు ప్రకటించారు. సింగరేణి విషయంలో ప్రశ్నిస్తున్న నేతలు మైన్స్ వేలంలో ఎందుకు పాల్గొనలేదో సమాధానం చెప్పాలి. ఐరన్ ఓర్, సున్నపురాయి గనులకు వేలం వేయకుండా నిర్లక్ష్యం చేశారు. ఓడిపోయామనే బాధలో కేటీఆర్ ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. ఆయన వ్యాఖ్యలపై జాలి చూపించాలి' అని కిషన్‌రెడ్డి అన్నారు.

# అనర్హులు రేషన్ కార్డులు వాపస్ చేయాలి

**- లేకపోతే అర్హులకు ప్రయోజనాలు దెబ్బతింటాయి - అధికారులు అతి చేస్తే బదిలీలుండవు.. నేరుగా తొలగింపే..**

**- వారు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలి - మాది పేదల ప్రభుత్వం : మంత్రి పొంగులేటి**

ఖమ్మం (ప్రజామంటలు):



అక్రమంగా, అర్హత లేకున్నా రేషన్‌కార్డ్ కలిగివుంటే సరెండర్ చేయాలని రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. అనర్హులు కార్డులు పొందితే అర్హులకు ప్రయోజనాలు దెబ్బతింటాయని అన్నారు. అనర్హులైన వారు తప్పుకుంటే మంచిదన్నారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని నేలకొండపల్లి మండలంలో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మా ప్రభుత్వం ధనుకులకి కాదు బీదవారి ప్రభుత్వమని, ప్రజలకి అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. ఎవరైనా అధికారులు ఎక్కువ చేస్తే నా పాలనలో ట్రాన్స్ఫర్లు ఉండవు డైరెక్ట్గా రిమూవ్ చేయడమేనని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజలకి ఎంత బాధ ఉంటే మీ మీద కంప్లైంట్ చేస్తారు అది అర్థం చేసుకోవాల్సిన బాధ్యత అధికారులదే అని ఆయన అన్నారు. ప్రజాసమస్యలు పట్టించుకోలేని వారిని ప్రభుత్వ ఉపేక్షించబోదని హెచ్చరించారు. అధికారులంతా సక్రమంగా పనిచేయాలని, కబ్జాకు గురైన వాటన్నిటిని బయటకు తీసి పేదోడికి అప్పజెప్పాలని ఆయన సూచించారు. ఇకనైనా ప్రతిపక్షాలు ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని పొంగులేటి తెలిపారు. మూడేళ్లలో అర్హులైన పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. ఎన్నికల వేళ ఇచ్చిన మాట ప్రకారం.. త్వరలోనే రేషన్ కార్డులు, పింఛన్లు ఇవ్వనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. రూ.31వేల కోట్లతో రైతుల రుణాలను మాఫీ చేయనున్నామని పొంగులేటి తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయని చెప్పారు.



### ఎంపీ అరవింద్ ను కలిసి సన్మానించిన రాయికల్ పద్మశాలి యువజన సంఘం నాయకులు

రాయికల్ జూన్ 22 (ప్రజామంటలు):

నిజామాబాద్ పార్లమెంటు ఎంపీ గా ధర్మపురి అరవింద్ 2వ సారి అత్యదిక మెజారిటీతో విజయం సాధించిన సందర్భంగా రాయికల్ పద్మశాలి యువజన సంఘం తరపున మర్యాదపూర్వకంగా కలిసి, ఎంపీ ని బుక్స్ పెన్నులతో కలిపి సన్మానించి సంఘ అభివృద్ధికి సహకరించగలరని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘ అధ్యక్షులు సామల్ల సతీష్, ఉపాధ్యక్షులు సింగని సతీష్, ప్రధాన కార్యదర్శి ఆడెపు రాజీవ్ నేత లు పాల్గొన్నారు.

### రౌడీ షీటర్లకు పోలీసుల కౌన్సిలింగ్



సికింద్రాబాద్ జూన్ 22 (ప్రజామంటలు):

వారాసిగూడ పోలీస్ స్టేషన్ లో శనివారం రౌడీ షీటర్లకు పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇక నుంచి ఎలాంటి క్రిమినల్ యాక్టివిటీస్ లల్లో ఇన్వాల్ కావద్దని స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఆర్. సైదులు వారికి సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. లేనిపక్షంలో చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు.

## చిలకలగూడ పీఎస్ పరిధిలో కాల్పుల కలకలం

### మెట్టుగూడ వద్ద డెకాయి ఆపరేషన్

సికింద్రాబాద్ జూన్ 22 (ప్రజామంటలు):

చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసుల కాల్పులు




కలకలం రేపాయి. వివరాలు ఇవి....సిటీలో ఇటీవల పెరుగుతున్న దోపిడీలు, హత్య, అత్యాచారాలు లాంటి క్రైమ్ సంఘటనల నేపధ్యంలో ఉన్నతాధికారుల సూచనలతో పోలీసులు డెకాయి ఆపరేషన్ లను ముమ్మరం చేశారు. ఈక్రమంలో శుక్రవారం అర్ధరాత్రి చిలకలగూడ పీఎస్ పరిధిలోని మెట్టుగూడ ప్రాంతంలో ఏఆర్, క్రైమ్ పోలీసుల ఆధ్వర్యంలో డెకాయి ఆపరేషన్ నిర్వహించారు. అర్ధరాత్రి 2.40 గంటల ప్రాంతంలో మఫ్టీలో ఉన్న పోలీసులకు నలుగురు యువకులు అనుమానస్పదంగా తిరగడం కనిపించింది. ఈ క్రమంలో వీరిని పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా, వారు పారిపోవడానికి ప్రయత్నించారు. దాంతో ఓ కానిస్టేబుల్ గాలిలో కాల్పులు జరిపి, సదరు నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. నలుగురు యువకులు స్టూడెంట్స్ అని, ఎలాంటి నేర చరిత్ర లేదని తర్వాత పోలీసుల విచారణలో వెల్లడైనట్లు తెలిసింది. సెల్ఫోన్లు, చైన్ స్నాచింగ్ సంఘటనలతో వీరికి సంబందం లేదని పోలీసులు తేల్చారు.

## మాదాపూర్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత

### బెంగుళూరు నుంచి తరలిస్తుండగా వ్యక్తి అరెస్ట్

హైదరాబాద్,జూన్22 (ప్రజామంటలు): మాదాపూర్‌లో మరోసారి భారీగా డ్రగ్స్ పట్టుబడింది. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కి డ్రగ్స్ తీసుకొస్తున్న సాయిచరణ్‌ని టీజీ న్యాబ్, మాదాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డ్రగ్స్‌ని చిన్న చిన్న ప్యాకెట్లలో పెట్టి.. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కి వచ్చే ట్రావెల్స్ డ్రైవర్ల ద్వారా సరఫరా చేస్తున్నట్టు గుర్తించారు. డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న వ్యాపారవేత్తలు మాలిక్ లోకేశ్, సందీప్‌రెడ్డి, రాహుల్, సుబ్రహ్మణ్యంలతో పాటు సాయిచరణ్‌ను నార్కోటిక్ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. సాయి చరణ్ నుంచి పెద్ద మొత్తంలో ఎండీఎంఏ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. గతంలోనూ డ్రగ్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు సాయిచరణ్‌ను పట్టుకున్నారు. నిందితుడు హైదరాబాద్, నెల్లూరు, విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖలోని దాదాపు 50 మంది వ్యాపారవేత్తలకు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్టు దర్యాప్తులో తేలింది.

## తల్లిదండ్రులారా...!
# ఈ అవకాశాన్ని వినియోగించుకోండి...!

**సోమవారం విద్యార్థులకు గార్డియన్ స్కూల్ లో నోట్ బుక్స్ పంపిణీ**

**భవిష్యత్తులో విద్యార్థులకు మధ్యాహ్న భోజన వసతి**

**ఆర్థిక భారం తగ్గించడమే మా ఫౌండేషన్ ఉద్దేశం**

**సాహితి ఫౌండేషన్ కోఆర్డినేటర్ మహమ్మద్ అంకూస్**

జమ్మికుంట జూన్ 22 (ప్రజామంటలు): జమ్మికుంట పరిసర ప్రాంత తల్లిదండ్రులారా మా సాహితి ఫౌండేషన్ కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకొని ఆర్థిక భారాన్ని తగ్గించుకోవాలని కోరుచున్నామని సాహితి ఫౌండేషన్ కోఆర్డినేటర్ మహమ్మద్ అంకుష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే మేము నిర్వహిస్తున్న గార్డియన్ పాఠశాలలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు స్లైట్స్ పంపిణీ చేయడం జరిగింది. వచ్చే సోమవారం నాడు విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ కూడా చేయటం జరుగుతుందని తెలుపుతూ, అలాగే భవిష్యత్తులో మా పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన వసతి కూడా ఏర్పాటు చేస్తామని తెలుపుచున్నాము. కాబట్టి తల్లిదండ్రులారా హంగులు, హార్భాటాలకు వెళ్లి నష్టపోవద్దని మా ఫౌండేషన్ కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని మీ పిల్లల మా పాఠశాలలో చేర్పించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరుతున్నట్లు తల్లిదండ్రులకు తెలిపారు.




## బాల సదన్ శిశు గృహాలను సందర్శించిన జగిత్యాల సీనియర్ సివిల్ జడ్జ్ కె. ప్రసాద్

జగిత్యాల జూన్ 22 (ప్రజామంటలు): కేంద్రంలోని బాల సదన్ శిశు గృహాలను శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ సీనియర్ సివిల్ జడ్జ్ కె. ప్రసాద్ సందర్శించారు. న్యాయ విజ్ఞాన సదస్సులో బాలసదన్ లోని సిబ్బందితో కలిసి ముచ్చటించారు, పిల్లలు బాల్యం నుండే మంచి నడవడికను అలవర్చుకోవాలని పిల్లలు మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు అలాగే వివిధ సౌకర్యాలను పరిశీలించారు. డార్మిటరీలు, మరుగుదొడ్లు, వంటశాలలు మరియు స్టోర్‌రూమ్‌లు, పరిశుభ్రత, మరియు పిల్లలకు అందించే ఆహారం నాణ్యతగా ఉండేలా చూడాలని, దోమల బెడద వంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని కోరారు. ఎలాంటి న్యాయ పరమైన సలహాలు అవసరమైన సంప్రదించాల్సిందిగా నిర్వాహకులను ఆదేశించారు.ఈ కార్యక్రమం లో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కె. చంద్ర మోహన్, పి. సతీష్, ఆర్. విజయ్ కృష్ణ మరియు డిఎల్ఎస్ఏ సూపరింటెంట్ వెంకన్న పాల్గొన్నారు.



## షిరిడి సాయికి ఫల రసాభిషేకం

జగిత్యాల జూన్ 22 (ప్రజామంటలు): జిల్లా కేంద్రం కృష్ణా నగర్ లోని శిరిడీ సాయిబాబా మందిరంలో 25 వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం బాబా వారికి షోడష ఫల రసాభిషేకం, పుష్పార్చన, హారతి, మంత్ర పుష్పం,అనంతరం అన్న దానం జరిగింది. షో డష ఫల రస అభి షేకం ప్రముఖ పండితులు తీగుళ్ల విషు శర్మ జరిపారు. వైదిక క్రతువు విషు శర్మ, ఆలయ ప్రధాన అర్చకులు, వేనయ్య, సంజయ్ శర్మ,నిర్వహించారు. ప్రముఖ జ్యోతిష్య, పౌరాణిక,వేద పండితులు శ్రీమాన్ నంబి వేణు గోపాల ఆచార్య కౌశిక కరకమలములచే ఆలయ ప్రధాన కార్య దర్శి ఎలగందల సత్య నారాయణ కి ఘన సన్మానం చేశారు. ఈ నాటి కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు డా. సతీష్ కుమార్, నాగుల కిషన్ గౌడ్, మార కైలాసం, సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం, పురుషోత్తమ రావు, రాంకిషన్ రావు, డా.వి. రాజన్న, మానాల కిషన్, గొల్లపెల్లి శ్రీనివాస్ గౌడ్, చంద్ర శేఖర్ గౌడ్, రవి చంద్ర, కంచి కిషన్, గంగాధర్, మారుతీ రావు రాజలింగం, రామ కృష్ణ రావు తదితరులు పాల్గొన్నారు.



## గోవధ శాల తరలింపుకై ఎంపీ అరవింద్ కు వినతి

జగిత్యాల జూన్ 22 ( ప్రజామంటలు): పట్టణంలోని స్థానిక 13వ వార్డు సుతారిపేట్ లో చట్ట విరుద్ధంగా జరుగుతున్న గోవధ మరి అక్కడ నిలువ ఉంచిన వ్యర్థాల కారణంగా విపరీతమైన దుర్గంధం వలన అనారోగ్యానికి గురి అవుతున్న కారణంగా అక్కడి గోవదశాలను సత్వరమే జనావాసాలను మధ్య నుండి తొలగించాల్సిందిగా నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురి కి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల్ నియోజకవర్గ ఇన్చార్జ్ డా. బోగ శ్రావణి తో కలసి వినతి పత్రం అందజేసిన జగిత్యాల పట్టణ 14వ వార్డు కౌన్సిలర్ కూతురు పద్మ మరియు కాలనీవాసులు తదితరులు ఉన్నారు.



## కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రిని కలిసిన బీజేపీ సీనియర్ నాయకులు

కరీంనగర్ జూన్ 22 (ప్రజామంటలు): కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ను వారి కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపిన బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకులు ముదిగంటి రవీందర్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చం ఇచ్చి శాలువా కప్పి ఘనంగా సన్మానించిన సీనియర్ నాయకులు ముదిగంటి రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఏ సిఎస్ రాజు, నల్ల రవి,నారెందుల శ్రీనివాస్,సిపెల్లి రవీందర్, లింగంపెట శ్రీనివాస్, ఆంకర్ సుధాకర్, చీటీ చంద్రశేఖర్ రావు, సంపూర్ణ చారి, సిరిసిల్ల వేణు,ఎడమల వెంకట్ రెడ్డి, కిషోర్ సింగ్, లక్ష్మ రెడ్డి, గట్టిపెళ్ళి జ్ఞానేశ్వర్, గోగికర్ మహేందర్, బాలేటి శ్రీనివాస్, కుర్మచలం సతీష్, బిట్టు, పరందాము, గొడిసెల నాగరాజు, శేఖర్, పొలసా సత్తి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



## గోధుర్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఇన్స్పైర్ మనక్ జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపిక

ఇబ్రహీంపట్నం జూన్ 22 (ప్రజామంటలు): ఈనెల 15, 16 తేదీలలో జరిగిన ఇన్స్పైర్ మనకు రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయిలో రెండవ స్థానంలో నిలిచి జాతీయస్థాయికి ఎంపికైన ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని గోదుర్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కుమారి బండి నవ్యశ్రీ, పరికరం పేరు అడ్జస్టబుల్ పోడియం. రకరకాల కార్యక్రమాలలో వ్యాఖ్యాత మాట్లాడడానికి పోడియం చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా స్కూల్లో జరిగే కార్యక్రమాలలో విద్యార్థులు ఎత్తులో ఉంటారు . ఈ అడ్జస్టేబుల్ పోడియం ను మనం మాట్లాడే వ్యాఖ్యాత ఎత్తు కనుగుణంగా సరి చేసుకోవచ్చు. దీనితో ముఖ్యంగా పిల్లలు ఎలాంటి బిడియం లేకుండా ధారాళంగా మాట్లాడడానికి ఉపయోగపడుతుంది. జగిత్యాల జిల్లా నుంచి జాతీయ స్థాయికి ఎంపికైన ఇన్నోవేషన్ను చేసిన బండి నవ్య శ్రీ, మరియు గైడ్ టీచర్ సిహెచ్. శారద గార్లను ప్రధానోపాధ్యాయులు బందారి మధు గారు, మరియు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు అభినందించారు.




### లంచం తీసుకుబోయే సమయంలో
## ఏసీబీ అధికారులు ఎంట్రీ
### గమనించి తప్పించుకున్న ఎస్ఐ

జగిత్యాల జిల్లా ప్రతినిధి జూన్ 22 (ప్రజామంటలు): జగిత్యాల జిల్లాలోని రాయికల్ పోలీస్ స్టేషన్ పరిదిలో ఇసుక ట్రాక్టర్ల రవాణా విషయంలో చోటు చేసుకున్న లావాదేవీల్లో అక్కడి ఎస్ఐకి రూ. 25 వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. అయితే డబ్బులు ఇవ్వడంలో జాప్యం జరిగింది. దీంతో తరుచూ వేధిస్తున్న సదరు ఎస్ఐపై ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే మధ్యవర్తి ద్వారా ఈ డబ్బులు ఇచ్చేందుకు నిర్ణయం జరగగా, డబ్బులు తీసుకుంటున్న క్రమంలో ఎస్ఐని రెడ్ హ్యాండెడ్‌గా పట్టివ్వాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో శుక్రవారం రాత్రి 11 గంటల నుండి 12 గంటల ప్రాంతంలో బాధితులు, ఏసీబీ అధికారులు స్టేషన్ కు చేరుకున్నారు. అయితే ఎస్ఐని పోలీస్ స్టేషన్‌కు పిలిపించగా, ఆయన స్టేషన్ కు చేరుకున్న తరువాత ఏసీబీ అధికారులను గమనించిన ఎస్ఐ వెంటనే వెనక్కి తిరిగి పరుగులు తీశాడు. దీంతో అతన్ని పట్టుకోలేకపోయిన ఏసీబీ అధికారులు మధ్యవర్తిని అదుపులోకి తీసుకున్నారు. పరారీలో ఉన్న ఎస్ఐ ఆచూకి కోసం ఏసీబీ అధికారులు గాలింపు చేపట్టారు. కాగా, ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసుకున్న ఏసీబీ అధికారులు దర్యాప్తు చేపట్టారు.



## కొత్తకొండలో ప్రత్యేక పూజలు నిర్వహించిన బండి సంజయ్ కుమార్

**పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జె.ఎస్.ఆర్., బీజేపీ నాయకులు**



భీమదేవరపల్లి జూన్ 22 (ప్రజామంటలు): హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో కేంద్ర హెూం శాఖ సహాయమంత్రి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి,కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ గారు ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది,వీరితో పాటు హన్మకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ,బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హుస్నాబాద్ నియోజకవర్గ నాయకులు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి (జె.ఎస్.ఆర్.) బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజాసేవకుడు రమణాచారిని అభినందించిన కలెక్టర్

మల్లాపూర్ జూన్ 22 (ప్రజామంటలు): జగిత్యాల జిల్లా నూతన కలెక్టర్ గా నియమితులైన సత్య ప్రసాద్ ని కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన మొగిలిపేట్ ప్రజాసేవకుడు వనతడుపుల రమణాచారి, పద్మశాలి సంఘం అధ్యక్షుడు గంగుల శ్రీనివాస్ లు పుష్పగుచ్చం అందించడం జరిగింది. గత జనవరి నుండి ఇప్పటివరకు సొంత నిధులతో మంచినీటి ట్యాంకర్ సేవలను చేస్తున్న రమణాచారి అని తెలుసుకున్న కలెక్టర్ ఆయనను అభినందించారు.





## కార్యకర్తలకు అండగా బిఆర్ఎస్ పార్టీ
### ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

రాయికల్ జూన్ 22 (ప్రజామంటలు): మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త అంకతి శ్రీనివాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ ప్రమాద భీమా ద్వారా మంజూరైన 2 లక్షల రూపాయల విలువగల చెక్కులను ఈరోజు వారి ఇంటికి స్వయంగా వెళ్లి కుటుంబ సభ్యులకు అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. అనంతరం గ్రామానికి చెందిన మహిళా కార్యకర్త చందా రాధ ప్రమాదవశాత్తూ గాయపడగా వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ అడిగి తెలుసుకున్నారు.

**ఎమ్మెల్యే మాట్లాడుతూ....**

పార్టీ సభ్యత్వం కలిగిన బిఆర్ఎస్ కార్యకర్తలు ప్రమాదవశాత్తు మరణిస్తే బిఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని, ఇటు ప్రభుత్వం సైతం రైతులకు రైతుభీమా ద్వారా భరోసా కల్పిస్తోందని అన్నారు. కార్యకర్తలకు అండగా నిలుస్తున్న పార్టీ ఒక బిఆరెస్ పార్టీ అని,రాష్ట్రం లో 60 లక్షల పైచిలుకు మంది బి అర్ ఎస్ సభ్యత్వం తీసుకున్నారని, బలమైన కార్యకర్తలు గల పార్టీ బిఆరెస్ పార్టీ అని అన్నారు. కార్యకర్తల భీమా కోసం దాదాపు 11 కోట్ల ఇన్సూరెన్స్ డబ్బులు చెల్లిస్తున్న పార్టీ బిఆరెస్ పార్టీ అని అన్నారు. జగిత్యాల నియోజకవర్గంలో 53 వేల మంది సభ్యులు కలిగి ఉన్నారు. ఇప్పటికీ 20 కి పైగా పార్టీ ప్రమాద భీమా చెక్కులు కార్యకర్తల కుటుంబాలకు అందజేయటం జరిగింది.

2 లక్షల చెక్కు తో ఆర్థికంగా కొంత కుటుంబానికి ఊరట కలుగుతుంది. గౌడ కులస్తులు ప్రమాదంలో శాశ్వత అంగవైకల్యం, మరణిస్తే 5 లక్షలు భీమా కెసిఆర్ కల్పించారు. గ్రామ అభివృద్ధికి కృషి చేయటం జరిగింది. గ్రామంలో బ్రిడ్జి లు,చెక్ డ్యాం లు,కుల సంఘం భవనాలు, ఈత తాటి వనం అభివృద్ధి చేయటం జరిగింది. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమం విద్య బోధన చేపట్టడం వల్ల ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ దొరకని పరిస్తితి వచ్చింది. మన ఊరు మన బడి పథకం లో భాగంగా మౌలిక సదుపాయాల కల్పన చేపట్టడం జరిగింది. రామారావు పల్లి బ్రిడ్జి పనులు పూర్తి అయ్యేలా చూస్తాం. బిఅర్ఎస్ పార్టీ నాయకుల సమిష్టి కృషి తో ఎమ్మెల్యే గా విజయం సాధించానని వారికి ధన్యవాదాలు అన్నారు. తొలి ముఖ్యమంత్రి కేసిఆర్ హయం లో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సంధ్యారాణి సురేందర్ నాయక్, మున్సిపల్ ఛైర్మెన్ మోర హనుమాండ్లు, మండల పార్టీ అధ్యక్షులు కోల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తిరుపతి గౌడ్, ఉప అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్,వైస్ ఎంపీపీ మహేశ్వర రావు, పాక్స్ ఛైర్మెన్ ఏనుగు మల్లారెడ్డి, ఎస్సి సెల్ మండల అధ్యక్షులు నేరటి శ్రీనివాస్,సీనియర్ నాయకులు అచ్యుత రావు, నారాయణ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు ప్రతాప్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాయిని శ్రీనివాస్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ చంద్ర శేఖర్, మాజీ ఎ.ఎం.సి. వైస్ చైర్మన్ కొల్లూరి వేణు, రఘునాథ్, రాజేందర్ గౌడ్, రొట్టె శ్రీనివాస్, రుక్కు భాయ్, సోమయ్య, కనకయ్య, ప్రవీణ్, భూక్యా లక్ష్మి, గంగాధర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## గాంధీలో కళ్ళకు గంతలు కట్టుకొని జూడాల ఆందోళన



సికింద్రాబాద్ జూన్ 22 (ప్రజామంటలు): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కారించాలని కోరుతూ శనివారం భోజన విరామ సమయంలో జూనియర్ డాక్టర్లు గాంధీ ఆసుపత్రి ఎదుట కళ్ళకు గంతలు కట్టుకొని ఆందోళన నిర్వహించారు. ఇక నుంచైనా ప్రభుత్వం తమకు క్రమం తప్పకుండా రెగ్యులర్ గా స్టైఫండ్ ఇవ్వాలని, ఏపీ స్టూడెంట్లకు ఇస్తున్న 15 శాతం రిజర్వేషన్లను తొలగించాలని, ఉస్మానియా ఆసుపత్రికి నూతన భవనం నిర్మించాలని కోరారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో మెడికోలందరికి మెరుగైన హాస్టళ్ళను నిర్మించాలని, మౌళిక వసతులు కల్పించాలని సూపర్ స్పెషాలిటీ ఎస్ఆర్ ల ప్రెసిడెంట్ డా. హరీష్, జూడా స్టేట్ ప్రెసిడెంట్ డా. శ్రీహర్ష, గాంధీ జూడా ప్రెసిడెంట్ డా. ఎం. వంశీ కృష్ణ లు కోరారు. తమ డిమాండ్లను ప్రభుత్వం సత్వరమే పరిష్కారించాలని, లేనిపక్షంలో ఈనెల 24 సోమవారం నుంచి డ్యూటీలను బహిష్కరించి, నిరవధిక సమ్మెకు దిగుతామన్నారు.

## కనీసం నలుగురు పిల్లలుంటే..

# జీవితాంతం ట్యాక్స్ కట్టక్కర్లేదు

### హంగేరీ ప్రధాని విక్టోర్ అర్బన్

ఓవైపు ప్రపంచ జనాభా నానాటికీ పెరుగుతుంటే.. కొన్ని దేశాలను మాత్రం జననాల క్షీణత సమస్య వేధిస్తోంది.

ఆర్థిక, వృత్తిపరమైన సవాళ్లతో అక్కడి యువత పెళ్లిళ్లపై అనాసక్తి చూపడంతో భవిష్యత్ తరం తగ్గిపోతోంది. దీంతో వలసలపై ఆధారపడాల్సి వస్తోంది. ఐరోపా దేశం హంగేరీ (%ఎబఅస్త్రుతీఎ%) ప్రస్తుతం ఇలాంటి సమస్యనే ఎదుర్కొంటోంది. దీంతో జనాభాను పెంచుకునేందుకు ఆ దేశ ప్రభుత్వం వినూత్న ఆలోచనలు చేస్తోంది. ఇందులోభాగంగానే ఎక్కువమంది సంతానం ఉన్నవారు జీవితాంతం ఆదాయపు పన్ను కట్టాల్సిన అవసరం లేదని స్వయంగా దేశ ప్రధానే ప్రకటించడం గమనార్హం.

"ఐరోపాలో జననాలు చాలా తక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా పశ్చిమ దేశాల్లో ఈ సమస్యకు వలసలు పరిష్కారంగా మారుతున్నాయి. జనాభాను పెంచుకునేందుకు వలసదారులను ఆహ్వానించాల్సి వస్తోంది. అందుకే మేం విభిన్న ఆలోచనలతో ముందుకొచ్చాం. కనీసం నలుగురు లేదా అంతకంటే ఎక్కువమందిని కనే మహిళలకు తమ జీవితకాలం వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లింపు నుంచి మినహాయింపు కల్పిస్తాం" అని హంగేరీ ప్రధాని విక్టోర్ అర్బన్ తాజాగా ఆసక్తికర ప్రకటన చేశారు.

దీంతోపాటు పెద్ద కుటుంబాలు పెద్ద పెద్ద కార్లు కొనుగోలు చేసేందుకు వీలుగా సబ్సిడీని కూడా ఇవ్వనున్నట్లు హంగేరీ ప్రభుత్వం (%ఎబఅస్త్రుతీఎ +శీజవతీఅఎవత్%) వెల్లడించింది. అంతేగాక, పిల్లల పెంపకం కోసం దేశవ్యాప్తంగా 21వేల క్రెచ్‌లను ప్రారంభించినట్లు తెలిపింది. ఇలాంటి



మినహాయింపులతో పెళ్లిళ్లు, కుటుంబవ్యవస్థను ప్రోత్సహించినట్లవుతుందని అక్కడి సర్కారు అభిప్రాయపడుతోంది.

హంగేరీ ప్రభుత్వం గతంలోనూ ఇలాంటి బంపరాఫర్లు ప్రకటించింది. పెళ్లిళ్లు, జననాల రేటు ను పెంచేందుకు 2019లో ఓ స్కీమ్‌ను ప్రవేశపెట్టింది. దానికింద, 41ఏళ్లు రాకముందే పెళ్లి చేసుకునే అమ్మాయిలకు 10 మిలియన్ ఫోరింట్స్ (హంగేరీ కరెన్సీ) సబ్సిడీ రుణాలు కల్పించింది. పెళ్లయిన తర్వాత ఆ మహిళ ఇద్దరు పిల్లలకు జన్మనిస్తే రుణంలో మూడోవంతును మాఫీ చేస్తామని తెలిపింది. ఒకవేళ ముగ్గురు అంతకంటే ఎక్కువ సంతానం కలిగితే మొత్తం రుణాన్ని మాఫీ చేస్తామని ఆఫర్ ఇచ్చింది. ప్రస్తుతం హంగేరీ జనాభా 96.4లక్షలుగా ఉంది.

# జోద్‌పూర్ మత ఘర్షణలో ఇద్దరికి గాయాలు

### అల్లర్లను అదుపులోకి తెచ్చిన పోలీసులు

జైపూర్,జూన్22(ఆర్ఎన్ఎ):



రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో మత ఘర్షణలు జరిగాయి. ఇరు వర్గాల వారు రాళ్లు రువ్వుకున్నారు. ఒక షాపు, రెండు కార్లు, పోలీస్ వాహనానికి నిప్పుపెట్టారు. పోలీసులు లాఠీ ఛార్జ్ చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. టియర్ గ్యాస్ షెల్స్ కూడా ప్రయోగించారు. ఈ ఘర్షణలో ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. జోధ్‌పూర్ సుర్‌సాగర్ ప్రాంతంలోని రాజారాం సర్కిల్ సమీపంలోని ఈద్గా వద్ద కొత్తగా రెండు గేట్లను ముస్లింలు ఏర్పాటు చేశారు. ఈ విషయంపై గత కొన్ని రోజులుగా వివాదం జరుగుతున్నది. కాగా, శుక్రవారం రాత్రి 10:15 గంటల సమయంలో ఈద్గా గేట్ల ప్రారంభంపై స్థానిక హిందువులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మత ఘర్షణలు జరిగాయి. రెండు వర్గాల వారు రాళ్లు రువ్వుకున్నారు. ఉద్రిక్తతలు పెరుగడంతో ఒక సమూహం స్థానిక దుకాణాన్ని తగులబెట్టింది. పోలీస్ వ్యాన్‌తో సహా రెండు కార్లను ధ్వంసం చేశారు.మరోవైపు ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. అలాగే నాలుగైదు రౌండ్ల టియర్ గ్యాస్ షెల్స్ కూడా ప్రయోగించారు. రాళ్ల దాడిలో ఒక పోలీస్ అధికారి, కానిస్టేబుల్ గాయపడినట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఈ ఘర్షణకు సంబంధించి 51 మందిని అరెస్ట్ చేసినట్లు శనివారం వెల్లడించారు.

# బ్రిటన్‌లో టాటా స్టీల్ కార్మికుల సమ్మె

లండన్: బ్రిటన్‌లో టాటా స్టీల్‌కు చెందిన దాదాపు 1500 మంది కార్మికులు సమ్మెకు దిగనున్నారు. 2800 ఉద్యోగాల కోత, బ్లాస్ ఫర్నేస్‌ల మూసివేత వంటి కంపెనీ ప్రణాళికలకు వ్యతిరేకంగా జులై 8 నుంచి వీరు సమ్మె చేయనున్నారు.

వేల్స్‌లోని పోర్ట్ టాల్‌బోట్, లాన్‌వెర్న్ ప్లాంట్‌లకు చెందిన ఉద్యోగులు ఇందులో ఉన్నారు. బ్రిటన్‌లో ఉక్కు కార్మికులు సమ్మె చేయనుండటం గత 40 ఏళ్లలో ఇదే తొలిసారని కార్మిక సంఘాలు తెలిపాయి. సమ్మె కార్యరూపం దాలిస్తే, టాటా స్టీల్ బ్రిటన్ కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. టాటా స్టీల్ కార్మికులు తమ ఉద్యోగాల కోసం పోరాడటం లేదని, భవిష్యత్ కోసం పోరాడుతున్నట్లు యునైట్ జనరల్ సెక్రటరీ షారోన్ గ్రాహమ్ అన్నారు.

బహిరంగ మార్కెట్ లావాదేవీల ద్వారా యాక్సిస్ బ్యాంక్‌లో 0.5 శాతం వాటాకు సమానమైన 1.7 కోట్ల షేర్లను రూ.2,083 కోట్లకు ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ సంస్థ మోర్గాన్ స్టాన్లీ కొనుగోలు చేసింది.

# యులిప్‌లను పెట్టుబడి పథకాలుగా ప్రచారం చేయొద్దు

### బీమా సంస్థలకు ఐఆర్‌డీఏఐ మార్గదర్శకాలు

దిల్లీ: జీవిత బీమా సంస్థలు అందించే యూనిట్ ఆధారిత బీమా పాలసీ (యులిప్)లను పెట్టుబడి పథకాలుగా పేర్కొంటూ ప్రకటనలు జారీ చేయొద్దని భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) పేర్కొంది.ఈ మేరకు మాస్టర్ సర్క్యులర్‌ను జారీ చేసింది. యూనిట్ ఆధారిత, ఇండెక్స్ ఆధారిత బీమా పాలసీలను ఇక నుంచి పెట్టుబడి పథకాలుగా ప్రచారం చేయొద్దని బీమా సంస్థలకు సూచించింది. సంప్రదాయ పాలసీలతో పోలిస్తే, మార్కెట్ ఆధారిత బీమా పథకాలకు నష్టభయం ఉంటుందనే విషయాన్ని స్పష్టంగా తెలియజేయాలనీ ఆదేశించింది. పార్టిసిపేటింగ్ (బోనస్ ఇచ్చే పాలసీలు) ఎండోమెంట్ పాలసీలు ఇచ్చే బోనస్‌లకు సంబంధించి ఇచ్చే ఉదాహరణలు వాస్తవం కాదని, ఎలాంటి హామీ ఉండదనీ తెలియజేయాలి. వేరియబుల్ యాన్యుటీ పథకాల విషయంలోనూ నష్టభయానికి సంబంధించిన వివరాలతో ప్రకటనలు ఉండాలని పేర్కొంది. యూనిట్ ఆధారిత ఫండ్లు లేదా ఇండెక్స్ ఫండ్లను కొత్తగా తీసుకొచ్చారా, ఇప్పటికే ఉన్నాయా అనే వివరాలూ ప్రకటనల్లో ఉండాలి. జీవిత బీమా విలువ, అనుబంధ పాలసీల వివరాలు లేకుండా పత్రికా ప్రకటనలూ విడుదల చేయొద్దని మాస్టర్ సర్క్యులర్‌లో ఐఆర్‌డీఏఐ స్పష్టం చేసింది.

# బుగాటి.. రూ.34 కోట్ల హైబ్రిడ్ హైపర్ కార్

### గరిష్ఠ వేగం 445 కిలోమీటర్లు

ఫ్రాన్స్‌కు చెందిన విలాసవంత కార్ల తయారీ సంస్థ బుగాటీ ఆటో మొబైల్స్, తోబియాన్ హైపర్-జీటీ హైబ్రిడ్ కారును ఆవిష్కరించింది. గంటకు 445 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో, ప్రపంచంలోనే రోడ్లపై అత్యంత వేగంగా ప్రయాణించే వాహనంగా ఇది గుర్తింపు పొందనుంది. 40 మిలియన్ డాలర్ల (సుంకాలు కాకుండా సుమారు రూ.34 కోట్ల) ధర పలికే ఈ అత్యాధునిక కారుకు 8.3 లీటర్ వీ16 ఇంజిన్ అమర్చారు. దీనివల్ల 1000 హెచ్‌పీ శక్తినిస్తుంది. క్వాడ్ టర్బో డబ్ల్యూ 16 విద్యుత్తు మోటార్‌తో అదనంగా 800 హెచ్‌పీ శక్తి లభిస్తుంది. 25 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ఉంది. 1995 కిలోల బరువు మాత్రమే ఉండే ఈ కార్లను మొత్తం 250 మాత్రమే రూపొందిస్తామని కంపెనీ ప్రకటించింది.

# యూట్యూబ్‌లో కొత్త ఫీచర్..డీప్‌ఫేక్ వీడియోల ఆటకట్టు




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం పెరిగిపోయింది. ప్రతి రంగంలోనూ ఈ సాంకేతికతను చాలా మంది దుర్వినియోగం చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు.

దీన్ని అరికట్టేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది.

మరోవైపు తమ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లో వచ్చే డీప్‌ఫేక్ కంటెంట్‌ను అరికట్టడటంలో భాగంగా యూట్యూబ్ ముందడుగువేసింది.కొందరు కంటెంట్ క్రియేటర్లు తమ ఫాలోవర్లను ఆకట్టుకోవడంలో భాగంగా లేనిది ఉన్నట్టుగా.. ఉన్నది లేనట్టుగా చూపిస్తున్నారు. దీంతో ఏది నిజమైన వీడియోనో.. ఏది ఏఐ సాయంతో రూపొందించిన వీడియోనో తెలుసుకోలేక తికమకపడుతున్నారు. వ్యక్తులకు తెలియకుండా వారి వాయిస్‌ను ఉపయోగించి కంటెంట్‌ను అందిస్తున్నారు. దీనికి చెక్‌పెట్టేందుకు యూట్యూబ్ సరికొత్త నిబంధనల్ని తీసుకొచ్చింది. కంటెంట్ క్రియేటర్లు తమ వీడియోలో ఏఐని వినియోగిస్తుంటే ఆ విషయాన్ని యూజర్లకు స్పష్టంగా తెలియజేయాలని పేర్కొంది. తాజాగా మరికొన్ని ఫీచర్లు జోడించింది. వీటి సాయంతో వినియోగదారులు డీప్‌ఫేక్ కంటెంట్‌పై రిపోర్ట్ చేయొచ్చు.ఇకపై లైవ్‌స్ట్రీమ్ ప్రారంభించాలంటే సబ్‌స్క్రిప్షన్ ఉండాల్సిందే..! 'ఎక్స్'లో కీలక మార్పు ఇకపై యూట్యూబ్‌లో మీ ఫొటో లేదా వాయిస్‌ని ఉపయోగించి రూపొందించిన కంటెంట్ కనిపిస్తే వెంటనే రిపోర్ట్ చేయొచ్చు. యూజర్ల అభ్యర్థన మేరకు ఆ వీడియోలను పరిశీలించి, కంటెంట్ వాస్తవానికి విరుద్ధంగా ఉందా? అనే విషయాన్ని ధృవీకరించి సదరు వీడియోలను తొలగిస్తుంది. దీంతో యూజర్ల డీప్‌ఫేక్ వీడియోలను అరికట్టొచ్చని పేర్కొంది. యూజర్ల గోప్యతను పెంచడంలో భాగంగానే వీటిని తీసుకొచ్చినట్లు తన బ్లాగ్‌పోస్ట్‌లో పేర్కొంది.

# ఇకపై లైవ్‌స్ట్రీమ్ ప్రారంభించాలంటే సబ్‌స్క్రిప్షన్ ఉండాల్సిందే..!



బిలియనీర్ ఎలాన్ మస్క్‌కు కు చెందిన సామాజిక మాధ్యమం 'ఎక్స్'.. తన ప్రీమియం సబ్‌స్క్రైబర్లను పెంచుకొనే పనిలో పడింది. అందులోభాగంగా త్వరలో కొత్త మార్పును తీసుకు రానున్నట్లు ప్రకటించింది. ఇకపై లైవ్‌స్ట్రీమ్‌ను ప్రారంభించాలంటే కచ్చితంగా ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ ఉండాలని పేర్కొంది. ఈవిషయాన్ని లైవ్ ప్రొఫైల్ 'ఎక్స్' వేదికగా వెల్లడించింది.ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్, టిక్‌టాక్.. వంటి సోషల్‌మీడియా వేదికల్లోనూ లైవ్ స్ట్రీమింగ్ సదుపాయం ఉంది. అయితే వీటిలో ప్రత్యక్ష ప్రసారాన్ని ప్రారంభించాలంటే ఎటువంటి ప్రీమియం సభ్యత్వం అవసరం లేదు. రానున్న రోజుల్లో ప్రీమియం సబ్‌స్క్రైబర్లు మాత్రమే 'ఎక్స్'లో లైవ్ స్ట్రీమ్ చేసే సదుపాయం ఉండనుంది. అయితే ఎప్పటినుంచి ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయనే విషయం తెలియదు. 'ఎక్స్' బేసిక్ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ ధర నెలకు రూ.215 నుంచి ప్రారంభమవుతుంది. వాణిజ్య ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయం సైతం పడిపోతున్నట్లు చాలాకాలంగా నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈనేపథ్యంలో సబ్‌స్క్రైబర్ల ద్వారా వచ్చే ఆదాయంతో నష్టాన్ని పూడ్చుకునేందుకు మస్క్ ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగానే తాజా మార్పులు చేయనున్నట్లు సమాచారం. మరోవైపు.. మైక్రోబ్లాగింగ్ సైట్‌లో కొత్త యూజర్లు చేసే పోస్ట్‌తో పాటు, లైక్, రిప్లయ్, బుక్‌మార్క్ చేయాలన్నా చిన్న మొత్తంలో ఫీజు చెల్లించాల్సి రావొచ్చని మస్క్ వెల్లడించిన విషయం తెలిసిందే. అయితే ఇప్పటికే ఫిలిప్పీన్స్, న్యూజిలాండ్‌లోని కొత్త యూజర్లకు ఈ రుసుములు వసూలుచేయడం ప్రారంభించింది. అయితే ఫాలో, బ్రౌజింగ్ ఉచితంగానే చేయొచ్చని పేర్కొంది.

# వాణిజ్య వాహనాల కోసం కొత్త టైర్లు

### విపణిలోకి విడుదల చేసిన జేకే టైర్




హైదరాబాద్: మారుతున్న రవాణా రంగ అవసరాలకు అనుగుణంగా వాణిజ్య వాహనాల కోసం సరికొత్త టైర్ల శ్రేణిని జేకే టైర్ అండ్ ఇండస్ట్రీస్ ఆవిష్కరించింది.శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వీటిని సంస్థ ప్రెసిడెంట్ అనూజ్ కథారియా విపణిలోకి విడుదల చేశారు. ఇందులో జెట్‌వే జేయూఎం ఎక్స్ఎం, జెట్‌వే జేయూసీ ఎక్స్ఎం, జెట్‌స్టీల్ జేడీసీ ఎక్స్‌డీతోపాటు విద్యుత్ బస్సుల కోసం ప్రత్యేకంగా జెట్‌వే జేయూఎక్స్‌ఈ టైర్లు ఉన్నాయి. దేశంలో వాణిజ్య వాహనాల టైర్లు ఏడాదికి దాదాపు 1.20 కోట్ల మేరకు అమ్ముడవుతున్నాయని, ఏటా 5% వృద్ధి లభిస్తోందన్నారు. ఇందులో తాము నాయకత్వ స్థానంలో ఉన్నామన్నారు. విస్తరణ ప్రణాళికల్లో భాగంగా రూ.1,400 కోట్ల మేరకు పెట్టుబడులు పెడుతున్నామని వివరించారు. మొత్తం 500 రకాల టైర్లను అందిస్తున్నామని, ఇందులో 12 అడుగుల ఎత్తువీ ఉన్నాయన్నారు.

# ఉక్రెయిన్‌కు ఆయుధాలిచ్చి తప్పు చేయకండి

### దక్షిణ కొరియాకు పుతిన్ హెచ్చరిక

మాస్కో: ఉక్రెయిన్‌కు ఆయుధాలు సరఫరా చేయాలన్న నిర్ణయం తీసుకుంటే అది దక్షిణ కొరియా చేసే అతి పెద్ద తప్పిదం అవుతుందని రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరించారు.

వియత్నాంలో రెండు రోజుల పర్యటనలో ఉన్న పుతిన్.. ఈ వ్యాఖ్యలు చేశారు. బుధవారం రష్యా, ఉత్తర కొరియా నూతన సైనిక ఒప్పందంపై సంతకాలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై దక్షిణ కొరియా మండిపడింది.

మాస్కోపై పోరాడేందుకు ఉక్రెయిన్‌కు ఆయుధాలు అందజేస్తామని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో పుతిన్ మాట్లాడుతూ.. "మా సైనిక ఒప్పందంపై దక్షిణ కొరియా ఆందోళన చెందాల్సిన పనిలేదు. సంతకాలు చేసిన దేశాల్లో ఒక దానిపై దాడి చేసినపుడు మాత్రమే మా ఒప్పందం అమల్లోకి వస్తుంది.

నాకు తెలిసినంత వరకు ఉత్తరకొరియాపై దాడి చేయాలని దక్షిణ కొరియా అనుకోవడం లేదు. ఉక్రెయిన్‌కు ఆయుధ సరఫరాల విషయానికొస్తే, అది పెద్ద తప్పిదం అవుతుంది. అది జరగదనే భావిస్తున్నా. జరిగితే మేం కూడా అందుకు తగ్గట్టు నిర్ణయాలు తీసుకుంటాం. అవి ప్రస్తుత దక్షిణ కొరియా నాయకత్వానికి ఏమాత్రం రుచించవు" అని పుతిన్ తెలిపారు.



NATIONAL International

# త్వరలో పబ్లిక్ ఇష్యూకు జెప్టో!

### తాజాగా రూ.5,500 కోట్ల సమీకరణఏడాదిలో విలువ మూడింతలు




దిల్లీ: నిత్యావసరాలు సరఫరా చేసే అంకుర సంస్థ జెప్టో తాజాగా రూ.5,500 కోట్ల (665 మిలియన్ డాలర్లు) పెట్టుబడులను సమీకరించింది. కంపెనీ విలువను సుమారు రూ.30,000 కోట్లు (3.6 బిలియన్ డాలర్లు)గా లెక్కగట్టి ఈ నిధుల సమీకరణను పూర్తి చేసింది. ఏడాదిక్రితంతో పోలిస్తే కంపెనీ విలువ సుమారు మూడింతలు కావడం గమనార్హం. అధిక పెట్టుబడి అవసరం ఉండటమే కాకుండా, తక్కువ మార్జిన్ లభించే నిత్యావసరాల సరఫరా రంగంలో పోటీ కూడా తీవ్రంగానే ఉంటుంది. అమెజాన్, బ్లింకిట్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, బిగ్ బాస్కెట్‌తో పోటీ పడేందుకు తాజాగా సమీకరించిన నిధులు జెప్టోకు ఉపయోగపడనున్నాయి. ఈ నిధుల సమీకరణ ప్రక్రియలో ప్రస్తుత వాటాదార్లతో పాటు కొత్త పెట్టుబడిదార్లు పాల్గొన్నాయని జెప్టో వెల్లడించింది.

ఏర్పాటైంది 2021లోనే: స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ ప్రోగ్రామ్ అభ్యసించిన ఆదిత్ పాలిచా (21) తన బాల్య మిత్రుడైన కైవల్య వోహ్రాతో కలిసి 2021లో జెప్టోను స్థాపించారు. త్వరలోనే మిగులు నగదు నిల్వల స్థాయికి జెప్టో చేరుకునే అవకాశం ఉంది. సమీప భవిష్యత్‌లో పబ్లిక్ ఇష్యూకు వెళ్లే యోచన లో సంస్థ ఉన్నట్లు తెలుస్తోంది. క్విక్ ఇ-కామర్స్‌గా వ్యవహరించే, 10 నిమిషాల్లో వస్తువుల సరఫరా సేవల విభాగంలో జెప్టోకు 29% మార్కెట్ వాటా ఉంది. సుమారు 40% వాటాతో బ్లింకిట్ ఈ విభాగంలో అగ్రగామిగా కొనసాగుతోంది.

# ఎన్‌పీఎస్‌లో కొత్త లైఫ్ సైకిల్ ఫండ్

### సెప్టెంబరులో అందుబాటులోకి పీఎఫ్ఆర్‌డీఏ

దిల్లీ: జాతీయ పింఛను పథకం (ఎన్‌పీఎస్)లో ప్రభుత్వేతర చందాదారుల కోసం కొత్త లైఫ్ సైకిల్ ఫండ్ తీసుకొస్తున్నట్లు పింఛను నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (పీఎఫ్ఆర్‌డీఏ) వెల్లడించింది. సెప్టెంబరు నాటికి ఇది అందుబాటులోకి వస్తుందని పీఎఫ్ఆర్‌డీఏ ఛైర్మన్ దీపక్ మొహంతి శుక్రవారం వెల్లడించారు. ప్రస్తుతం 35 ఏళ్ల దాటిన వారికి ఈక్విటీల్లో పెట్టుబడులు తగ్గిస్తున్నామని, దీన్ని 45 ఏళ్ల వరకూ పెంచుతున్నట్లు తెలిపారు. దీనివల్ల ఈక్విటీ ఆధారిత పెట్టుబడులకు అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ప్రస్తుతం ఎల్‌సీ 75, ఎల్‌సీ 50, ఎల్‌సీ 25 పేర్లతో మూడు లైఫ్ సైకిల్ ఫండ్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కొత్త పథకం సెప్టెంబరులో అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. లైఫ్ సైకిల్ ఫండ్ చందాదారులకు, పెట్టుబడులను ఎంచుకునే స్వేచ్ఛను ఇది అందిస్తుంది. ఈక్విటీ, డెట్ కేటాయింపులను నిర్ణయించుకోవచ్చు.

గత ఆర్థిక సంవత్సరంలో అటల్ పెన్షన్ యోజన(ఏపీవై)లో 1.24 కోట్ల మంది చందాదారులు చేరగా, ఇందులో 52% మహిళలున్నారని తెలిపారు. ఈ పథకంలో మొత్తం 6.6 కోట్ల మంది చేరారన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1.30 కోట్ల మందిని ఈ పథకంలో చేర్చాలనే లక్ష్యంతో ఉన్నట్లు వివరించారు. 2023-24లో ఎన్‌పీఎస్ కింద 9.7 లక్షల ప్రభుత్వేతర చందాదారులు నమోదు కాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో 11 లక్షలకు చేరుకుంటుందని పేర్కొన్నారు. మార్కెట్ సాధారణంగా పనిచేస్తే ఏపీవై సహా మొత్తం నిధి గత ఆర్థిక సంవత్సరంలో ఉన్న రూ.12.4 లక్షల కోట్ల నుంచి ఈ ఆర్థిక సంవత్సరం చివరికి రూ.15లక్షల కోట్లకు పెరుగుతుందని పేర్కొన్నారు.



# సమగ్ర వ్యవసాయ విధానం రావాలి !

## పంటల బీమాపై రైతుల్లో చైతన్యం కల్పించాలి



న్యూఢిల్లీ, జూన్ 22 (ప్రజా మంటలు):
దేశంలో వర్షాభావ పరిస్థితులు రైతాంగాన్ని కుంగదీస్తున్నాయి. నైరుతి వచ్చినా వర్షం చుక్కలేదు. ఎండల తీవ్రతతో పంటలు వేయలేని దుస్థితి నెలకొంది. ప్రాజెక్టుల కింద అక్కడక్కడా పంటలు వేసుకున్నా దేశంలోని చాలా ప్రాంతాల్లో ఇంకా సాగుబడి సాగడం లేదు. ఏరువాక ప్రారంభం నాటికి వర్షాలు పడాలి. కానీ ఏరువాక పున్నమి వచ్చినా ఇంకా వర్షాభావం కొనసాగుతోంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అన్నదాతలు ఆకాశంకేసి చూస్తున్నారు. దీనికి తోడు సమగ్ర పంటల విధానంపై ఏ ప్రభుత్వం కూడా చర్చించడం లేదు. రైతులు ప్రభుత్వం వైపు ఎదురుచూడకుండా పంటల విధానాలను ప్రవేశ పెట్టాల్సిన పాలకులు ఈ విషయంలో నిర్లక్ష్యం గా ఉన్నారు. ఈ ఏడాది సాధారణ వర్షపాతం ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటించడంతో పరిస్థితి అనుభవిస్తే కానీ తెలియని పరిస్థితి ఉంది. ఈ క్రమంలో ఏ పంట సాగు విస్తీర్ణం ఎలా ఉంటుందన్నది స్పష్టం కానుంది. ప్రధానమంత్రి పంటల బీమా పథకం కింద వరి, మొక్కజొన్న, వేరుశనగ, శనగ పంటలకు వాతావరణ ఆధారిత బీమా పథకంలో భాగంగా మామిడి పంటలకు బీమా వర్తిస్తుంది. మోడీ కావచ్చు..రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు కావాచ్చు...వ్యవసాయ విధానం ప్రకటించడం లేదు. ఏటా పంటల బీమా పథకాలపై రైతులకు అవగాహన కల్పించడంలో వారిని ప్రీమియం చెల్లించేలా ప్రోత్సహించడంలో వ్యవసాయ శాఖ అధికారులు విఫలమవుతున్నారు. దీంతో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు వారికి పరిహారం అందడం లేదు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఇదే పరిస్తితి ఉంది. రైతులను చైతన్యం చేయించి వారితో నామమాత్రంగా బీమా సొమ్ము చెల్లించేలా చేయించడంలో అధికారులు విఫలం అవుతున్నారు. ప్రధానంగా బీమా పథకాల వల్ల కలిగే లబ్ధిపై వారికి సమాచారం ఉండడం లేదు. అలాగే ఏ పంటకు ఎంత చెల్లించాలన్న సమాచారం కూడా రైతులకు చేరడం లేదు. అలాగే పథకాల అమలుపై రైతుల్లో చైతన్యం కానరావడం లేదు. వడగళ్లు,విలయం సంభవించినప్పుడు ప్రభుత్వాలపై ఆధారపడి పరిహారం అందక లబోదిబోమంటున్నారు. దీనిని తప్పించేందుకు ఫసల్ బీమా వంటి పథకాలు అందుబాటులో ఉన్నాయి. రైతులను చైతన్యం చేయక పోవడం వల్ల ఆశించిన స్థాయిలో బీమాకు నోచుకో వడం లేదని తెలుస్తోంది. గతంలో కనీసం ఇందులో పదిశాతం మంది కూడ బీమా ప్రయోజనాలు పొందలేకపోయారు. వేల మంది రైతులు బీమా ప్రీమియం చెల్లించలేదని సమాచారం. క్షేత్ర స్థాయిలో అధికారులు తగిన రీతిలో రైతులకు బీమా సమాచారాన్ని చేం వేయక పోవడం తోనే బీమాకు దూరమవుతు న్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై విస్తృత ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఉంది. ప్రధానమంత్రి పంటల బీమా పథకంలో ఖరీఫ్, యాసంగి పంటల బీమా ప్రీమియం ధరలు ఖరారయ్యాయి. సీజన్‌కు సంబంధించి బీమా పథకంలో వరి, మొక్కజొన్న, వేరుశనగ, శనగ పంటలతో పాటు మామిడి తోటలను చేర్చారు. అతివృష్టి, అనావృష్టి, వడగండ్లు, ప్రకృతి విపత్తులతో పంటలు దెబ్బతింటే రైతులను ఆదుకోవడంలో బీమా పథకం ప్రధానపాత్ర పోషిస్తోంది. పత్తికి వాతావరణ ఆధారిత బీమా, సోయాబీన్‌కు గ్రామం యూనిట్, జొన్న, కంది, పెసర, మినుము తదితర పంటలకు మండలం యూనిట్‌గా పంట బీమా అమలు చేయనున్నారు. అత్యధికంగా వరి, మొక్కజొన్న , పత్తి, పెసర, మినుము సాగయ్యే అవకాశాలున్నాయని చెబుతున్నారు. పంట రుణం తీసుకునే రైతులు, రుణం అవసరం లేని రైతులు ఈ బీమా పథకాలను వినియోగించుకోవచ్చు. అయితే పంట రుణాలను పొందాలనుకున్న రైతులకు సంబంధించి రుణం అందజేసే సమయంలోనే ప్రీమియాన్ని తీసుకుని మిగతా మొత్తాన్ని సదరు రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. రుణాలు పొందని రైతులు నేరుగా బ్యాంకులు, మీసేవ కేంద్రాల ద్వారా బీమా ఏజెన్సీ ప్రతినిధులకు బీమా బీమా ప్రీమియం చెల్లించవచ్చు. పంట నష్టం జరిగితే పరిహారం రావాలంటే నిర్ణీత గడువులో బీమా చెల్లించాలి. ఈ విషయంలో రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి ప్రతి రైతు ప్రీమియం చెల్లించేలా కృషి చేయాలి. ప్రధానమంత్రి పంటల బీమా పథకానికి సంబంధించి ఎలాంటి సందేహాలున్నా ఏఈవోలు, ఏవోలను సంప్రదించేలా క్షేత్రస్థాయిలో రైతులకు తెలియచేయాలి. పంట రుణాలు తీసుకోని రైతులు నేరుగా ప్రీమియం చెల్లించుకునే వెసులుబాటు ఉంది. మీ సేవా కేంద్రాలు, బ్యాంకులు తదితర వాటి ద్వారా చెల్లించవచ్చు. ఇవన్నీ గ్రామస్థాయిలో ప్రచారం జరగాలి. అప్పుడే పంటలకు తగిన భరోసా దక్కుతుంది. మిర్చి, పత్తి, శనగ తదితర రైతులు నష్టం సంభవించినప్పుడు ఏ విధంగా పరిహారం పొంద వచ్చో గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు చేయాలి. విదేశీ పారిశ్రామికవేత్తలను కాళ్లావేళ్లాపడుతూ వారి ప్రాపకం కోసం పాకులాడే రోజులు పోయేలా రైతులు స్వయం సమృద్ధి సాధించాలి. అందుకు మనకున్న వనరులతో ముందుకు సాగాలి. మనదేశం వ్యవసాయిక దేశం. వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకుని రావడం, దాని అనుబంధ రంగాలను ప్రోత్సహించడం వల్ల ఒక్కో రైతు కనీసం వందమందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి కల్పించవచ్చు. దీంతో ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరగడంతో పాటు, ఎగుమతులకు అవకాశాలు పెరుగతాయి. విదేశీ మారకనిల్వలను సాధించవచ్చు. ఈ సూత్రాన్ని గతంలో ఉన్న ఏ ప్రభుత్వం పాటించడం లేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కూడా పాటించడం లేదు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రకటించిన మోడీ వారిని రోడ్డున పడేలా చేస్తున్నారు. కేవలం విదేశీ  పెట్టుబడులే సర్వస్వం అన్న విధంగా నేతలంతా ఆయా దేశాల ముందు  మోకరిల్లుతున్నాయి. కానీ ఏనాడు రైతులకు ఒక్క పైసా విదిల్చడం లేదు. గిట్టుబాటు ధరలు, పంటలకు బీమా తదితర అంశాలను పట్టించుకోవడం లేదు.

# తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతీస్తున్న ప్రభుత్వం

## బొగ్గు గనుల వేలంలో పాల్గొనడమే నిదర్శనం

### కాంగ్రెస్, బిజెపిలు తోడు దొంగలన్న కెటిఆర్

హైదరాబాద్,జూన్22 (ప్రజా మంటలు):
కాంగ్రెస్, బిజెపిలు తోడుదొంగలని, సీఎం రేవంత్ రెడ్డిపై, ఆయన చెబుతున్న అబద్దాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ముఖ్యమంత్రి గద్దెపై రేవంత్ ఎక్కిన తర్వాత కాంగ్రెస్, బీజేపీ కలిసి తెలంగాణ ప్రయోజనాలను తాకట్టుపెడుతున్న తీరు ప్రతి ఒక్క తెలంగాణ పౌరుడు గమనిస్తున్నారని చెప్పారు. రేవంత్, ఆయన ప్రభుత్వం చేస్తున్న అబద్దాల ప్రచారం చూసి జోసెఫ్ గోబెల్స్ కూడా తన సమాధిలోనే తలదించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. 60 ఏండ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకొని పోరాటం చేసి తెలంగాణ సాధించుకున్న పార్టీ తమదన్నారు. మరోవైపు తెలంగాణ ప్రజల ఆకాంక్షలను వినకుండా వాటిని క్రూరంగా అణిచి, వేల మందిని చంపిన పార్టీ కాంగ్రెస్ అని విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, తమ ప్రభుత్వం తెలంగాణలోని బొగ్గు గనుల అమ్మకాన్ని ఎల్లప్పుడూ వ్యతిరేకించిందన్నారు. అందుకే ప్రభుత్వం ఏ రోజూ వేలంలో పాల్గొనలేదని చెప్పారు. కానీ నేడు కాంగ్రెస్ పార్టీ



నిస్సిగ్గుగా వేలంలో పాల్గొని తెలంగాణ ప్రయోజనాలను దెబ్బ కొడుతుందని తెలిపారు. గతంలో కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ పోకడలతో తెలంగాణ బొగ్గు గనులను వేలం వేసిందని, కానీ బీఆర్ఎస్ వ్యతిరేకించడంతో ఇప్పటిదాకా అక్కడ నుంచి ఒక త్తటెడు బొగ్గు కూడా ఆ కంపెనీలు ఎత్తలేదని తెలిపారు. వేలంలో గనులను దక్కించుకున్న రెండు కంపెనీలు కేవలం బీఆర్ఎస్ పార్టీ సింగరేణి ప్రయోజనాల కోసం నిలబడడంతోనే మైనింగ్ ప్రారంభించలేదన్నారు. కేంద్రంలోని బీజేపీ.. గనులను కేటాయించినా, కేవలం రాష్ట్ర ప్రభుత్వ కఠిన వైఖరి, నిబద్ధత వల్లనే ఆ కంపెనీలు సింగరేణి బొగ్గును తవ్వలేకపోయాయని చెప్పారు. ఆ పూర్తి క్రెడిట్ బీఆర్ఎస్‌కు దక్కుతుందన్నారు. కానీ రేవంత్ పేర్కొన్న ఆ రెండు కంపెనీలు మహారాష్ట్రలో కాంగ్రెస్, శివసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు టాక్లి, జెన, బెల్లోర గనులను దక్కించుకున్న విషయం మర్చిపోవద్దని హితవు పలికారు. తెలంగాణ ప్రజల హక్కులను, ఆస్తులను, వనరులను తాకట్టు పెట్టడంలో కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు తోడుదొంగల్లా వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే నదీ జలాల వాటాను వదులుకున్న కాంగ్రెస్ తీరును రాష్ట్ర ప్రజలు తెలుసుకున్నారని చెప్పారు. తాజాగా బీజేపీకి అందిస్తున్న సహకారంతో సింగరేణి సంస్థను ప్రైవేటుపరం చేయాలన్న కుట్ర అందరికీ తెలిసిపోయిందని వెల్లడించారు. గనుల వేలంలో పాల్గొన్న మిమ్మల్ని, మీ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను, కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని తెలంగాణ చరిత్ర క్షమించదని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ రాష్ట్రానికి మీరు, మీ జాతీయ పార్టీలు చేస్తున్న ద్రోహానికి ప్రజలు సరైన సమయంలో ప్రజలు బలమైన గుణపాఠం చెప్తారని కేటీఆర్ అన్నారు.

# యూజీసీ నెట్ పరీక్ష పత్రం లీక్

## పాత్ర ఉన్న ఛానళ్లపై టెలిగ్రామ్ చర్యలు

న్యూఢిల్లీ, జూన్ 22 (ప్రజా మంటలు):
నీట్ పేపర్ లీక్ వ్యవహారం, అదే సమయంలో యూజీసీ నెట్ పరీక్ష రద్దు కావడం వంటి పరిణామాలు దేశంలో కలకలం సృష్టిస్తున్నాయి. ఆ పరీక్ష మంగళవారం జరగ్గా.. దానికి రెండు రోజుల ముందే పరీక్షా పత్రం లీక్ అయిందని, ఆ వెంటనే ఎన్‌క్రిప్టెడ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో అమ్మకానికి ఉంచారని సీబీఐ ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైన సంగతి తెలిసిందే. దీనిపై ఓ సోషల్ మీడియా ప్లాట్‌ఫామైన టెలిగ్రాం స్పందించింది. పేపర్ లీక్‌తో ప్రమేయం ఉన్న ఛానెళ్లపై చర్యలు తీసుకున్నట్లు జాతీయమీడియాకు వెల్లడించింది. పరీక్ష పత్రాలకు సంబంధించి అనధికారిక సమాచారాన్ని వ్యాప్తి చేసిన ఛానెళ్లను బ్లాక్ చేసినట్లు టెలిగ్రాం వెల్లడించింది. దేశ చట్టాలకు లోబడి, దర్యాప్తునకు సహకరిస్తున్నామని తెలిపింది. లీకేజీ వ్యవహారంలో ఈ సోషల్ మీడియా సంస్థపైనా విమర్శలు రావడంతో ఈ స్పందన వచ్చింది. దానిలో లీక్ అయిన పేపర్ అసలు పత్రంతో సరిపోలిందని ఇప్పటికే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. యూజీసీ నెట్ అవకతవకలపై సీబీఐ దర్యాప్తు చేస్తోన్న సంగతి తెలిసిందే. త్వరలో నెట్ పరీక్ష కొత్త తేదీని ప్రకటిస్తామని తెలిపింది. యూజీసీ నెట్ పరీక్షకు దాదాపు 11 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌నకు అర్హత సాధించడానికి, పీహెచ్‌డీల్లో ప్రవేశాలకు, విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకాలకు అర్హత సాధించడానికి ఈ పరీక్షను కేంద్రం నిర్వహిస్తోంది.

# అయోధ్య విగ్రహప్రతిష్ఠాపన పూజారి

## ఆచార్య లక్ష్మీకాంత్ దీక్షిత్ కన్నుమూత



వారణాసి, జూన్ 22 (ప్రజా మంటలు):
అయోధ్యలో రామ్‌లల్లా విగ్రహ ప్రాణప్రతిష్ఠ వేడుకకు ప్రధాన పూజారిగా వ్యవహరించిన ఆచార్య లక్ష్మీకాంత్ దీక్షిత్ (86) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. శనివారం తుదిశ్వాస విడిచినట్లు కుటుంబసభ్యులు వెల్లడించారు. కాశీలో పేరొందిన పండితుల్లో ఒకరిగా గుర్తింపుపొందిన లక్ష్మీకాంత్ స్వస్థలం మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లా. అయితే, ఆయన కుటుంబం తరతరాలుగా కాశీలోనే నివసిస్తోంది. మణికర్ణిక ఘాట్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. లక్ష్మీకాంత్ మృతిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌లు దిగ్భ్రాం÷-రతి వ్యక్తంచేశారు. ఆయన్ను దేశంలోని గొప్ప పండితుల్లో ఒకరిగా పేర్కొన్న ప్రధాని మోదీ.. కాశీ విశ్వనాథ్ ధామ్, అయోధ్య రామాలయం ప్రారంభోత్సవం నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. సంస్కృత భాషకు, భారతీయ సంస్కృతికి ఆయన చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని సీఎం ఆదిత్యనాథ్ సంతాపం తెలిపారు. జనవరి 22న ప్రధాని మోదీ చేతులమీదుగా అయోధ్య ఆలయంలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరిగిన విషయం తెలిసిందే.

# మేడ్చెల్ జ్యువెలరీ షాప్ దోపిడి కేసు

## 24 గంటల్లోనే ఛేదించిన పోలీసులు - సిసి కెమెరాల ఆధారంగా దొంగల గుర్తింపు



మేడ్చెల్, జూన్ 22 (ప్రజా మంటలు):
మేడ్చల్‌లో జ్యువెలరీ షాప్ దోపిడీ కేసును పోలీసులు ఛేధించారు. 24 గంటల్లోనే నిందితులను మేడ్చల్ పోలీసులు పట్టు కున్నారు. జూన్ 20న జగదాంబ జ్యువెలరీ షాప్ లో మాస్క్, బుర్ఖా ధరించి యజమానిని కత్తితో పొడిచి బంగారు ఆభరణాలు దోచుకునే ప్రయత్నం చేసిన సంగతి తెలిసిందే.. షాపు యజమాని ఫిర్యాదుతో సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను పట్టుకున్నారు పోలీసులు. ఈ కేసులో ముగ్గురి భాగస్వామ్యం ఉందని మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి అన్నారు. ఈ కేసులో నిందితులు హైదరాబాద్ కు సంబంధించిన వారే. ఈ కేసులో ప్రధాన నిందితులు నజీమ్ అజీజ్ కొటాడియా.. షేక్ సోహెల్.. నిందితులు రాబరికోసం చోరీ చేసిన బైక్‌ను వినియోగించారు. నిందితులు దీన్ని ఓయూ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ చేశారు. చోరీ చేయడానికి ముందు నిందితులు మూడుసార్లు రెక్కీ నిర్వహించారు. సుమారు పదిచోట్ల రెక్కీ నిర్వహించి మేడ్చల్లో దోపిడీకి యత్నించారు. నిందితులను పట్టుకోవడం కోసం సుమారు 200 సీసీ కెమెరాలు జల్లెడ పట్టాము. బైక్ నెంబర్ ఆధారంగా దర్యాప్తు చేపట్టినప్పుడు చోరీ చేసిన బైక్ గా గుర్తించాము. ఇటీవల చాధర్ ఘాట్ లో జరిగిన చోరీ నిందితుడు కోటడియా పాత్ర ఉంది. ముందుగా కోటాడియాను అరెస్ట్ చేశాం.. అతని ద్వారా షేక్ సోహెల్ అరెస్ట్ చేశాం. ఇద్దరికీ జైలులో పరిచయం ఏర్పడింది. ఇద్దరు నిందితులకి సహకరించిన మరొక వ్యక్తి పరారీలో ఉన్నాడని చెప్పారు. జగదాంబ జువెలరీ షాపులోకి మధ్యాహ్నం ఇద్దరు దుండగులు పల్సర్ బైక్ పై వచ్చారు. ఒకరు బుర్ఖా వేసుకోగా మరొకరు హెల్మెట్ పెట్టుకుని వచ్చి.. గోల్డ్ షాపు ఓనర్ శేషారామ్‌ను నగదు, గోల్డ్ బ్యాగులో వేయమని కత్తితో బెదిరించి పొడిచారు. ఆపై ఆభరణాలను దోచు కుంటుండగా.. దొంగల నుంచి తప్పించుకొని నెట్టేసి.. చోర్ చోర్ అంటూ ఓనర్ శేషారామ్ బయటకు పరుగులు తీశారు. దీంతో భయపడిన దొంగలు వచ్చిన బైక్ పైనే పారిపోయారు. ఘటన అంతా సీసీ పుటేజ్ లో రికార్డ్ అయింది. షాప్ ఓనర్ కంప్లయింట్ చేయగా పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, అడిషనల్ ఏసీపీ, మేడ్చల్ సీఐ వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. సీసీ టీవీ ఆధారంగా 24 గంటల్లోనే నిందితులను పట్టు కున్నారు. ఆభరణాల దుకాణ యజమానిని కత్తితో పొడిచి పట్టపగలే దోపిడీకి యత్నించిన ఘటన మేడ్చల్‌లో కలకలం సృష్టించింది.

# పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం జూడాల నిరసన

హైదరాబాద్,జూన్22 (ప్రజా మంటలు):
దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా మెడికల్ కళాశాల జూనియర్ డాక్టర్లు నిరసన ప్రదర్శన నిర్వహించారు. కళ్లకు గంతలు కట్టుకొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్ల సంఘం అధ్యక్షుడు దీపాంకర్ మాట్లాడుతూ.. 'అధికారుల చుట్టూ తిరగకుండా ప్రతి నెలా నిర్దిష్టమైన తేదీకి స్టైఫండ్ ఇవ్వాలని ఎప్పటి నుంచో కోరుతున్నాం. కానీ, ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఉస్మానియా ఆసుపత్రి భవనం మూసి వేసి నాలుగేళ్లు అయ్యింది. పక్కనే ఉన్న మరో భవనంలోకి ఆసుపత్రి మార్చారు. విపరీతమైన రద్దీ కారణంగా ఇన్‌ఫెక్షన్ల శాతం పెరుగుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మా డిమాండ్లపై లిఖితపూర్వక హామీ ఇవ్వాలని కోరారు.

# నీట్ పరీక్ష రద్దు చేయండి

## కిషన్ రెడ్డి ఇంటిముందు విద్యార్థి సంఘాల ఆందోళన

హైదరాబాద్,జూన్22 (ప్రజా మంటలు):
నీట్ పరీక్ష రద్దు చేయాలంటూ హైదరాబాద్ కాచిగూడలోని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఇంటి ఎదుట విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆధ్వర్యంలో కేంద్రమంత్రి ఇంటిని విద్యార్థిసంఘాల నేతలు ముట్టడించారు. జాతీయస్థాయి వైద్యవిద్య ప్రవేశపరీక్షలో అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ.. నీట్ ఛైర్మన్ రాజీనామా చేయాలంటూ నినాదాలు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు ఆందోళన చేస్తున్న బల్మూరి వెంకట్ సహా విద్యార్థిసంఘాల నాయకులను నల్లకుంట ఠాణాకు తరలించారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం తక్షణం స్పందించి నీట్‌పై దిద్దుబాటు చర్యలు చేపట్టాలని బల్మూరి వెంకట్ డిమాండ్ చేశారు.



EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com